ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3

అనంతపురం

జిల్లా వార్తలు

గురువారం 23 జనవరి 2025





డాకు మహారాజ్ కేక

అభిమానుల సమక్షంలో విజయోత్సవం

పాటపాడి.. తొడగొట్టి అలరించిన బాలయ్య

తరలివచ్చిన తారాగణం.. టీడీపీ నాయకులు



5



ఉష్ణోగ్రతలు

గరిష్ఠం	33.0
కనిష్ఠం	18.0

నకిలీ బంగారం ముఠా అరెస్ట్

రూ.21 లక్షల నగదు, 5 ద్విచక్ర వాహనాలు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం

5

పంట పండింది

● అరటి టన్ను రూ.25వేలు



రాయలచెరువులో సాగుచేసిన అరటిపంట



యాడికి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అరటి టన్ను రూ.25వేలు ధర పలుకుతుండటంతో పంట సాగు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం మండలంలోని రాయలచెరువు, తూట్రాళ్లపల్లి గ్రామాల్లో పలువురు రైతులు అరటి టన్ను రూ.25వేలతో విక్రయించారు. ఇదే ధర కొనసాగితే మంచి లాభాలు వస్తాయని పలువురు అరటి రైతులు తెలిపారు. అరటిలో మొదటి పంట ప్రస్తుతం టన్ను రూ.25వేలు, రెండో పంట గ్రేడింగ్‌ను బట్టి రూ.15వేల నుంచి 20వేలు ధర పలుకుతోందని రైతులు పేర్కొన్నారు. యాడికి మండలంలో 1900ఎకరాల్లో, పెద్దపప్పూరు మండలంలో 2700ఎకరాల్లో, తాడిపత్రి మండలంలో 100ఎకరాల్లో రైతులు అరటి సాగుచేశారు. ఎకరాకు 16టన్నుల నుంచి 20టన్నుల వరకు దిగుబడి తీస్తున్నారు. ఇక్కడ పండిస్తున్న అరటికి గల్ఫ్ దేశాల్లో మంచి డిమాండ్ ఉంటోంది. గతంతో పోలిస్తే ఈ ఏడాది అరటి ధరలు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.





రోడ్డు పక్కనే దుమ్ముతో నిండిన పొలాలు.. పూర్తిగా కంకర తేలిన రోడ్డు

మిరపను మింగేస్తున్న దుమ్ము

రోడ్డును తవ్వి వదిలేసిన కాంట్రాక్టర్

కరకముక్కల-పాల్తూరు దారిలో దెబ్బతింటున్న పంటలు

నష్టంపై రైతుల ఆందోళన

విడపనకల్లు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తూరు-కరకముక్కల రోడ్డు పనులు నిలిపివేసి దాదాపు నాలుగు సంవత్సరాలవుతోంది. వైసీపీ ప్రభుత్వంలో కరకముక్కల - పాల్తూరు రోడ్డు వేసేందుకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద రూ. 90 లక్షలతో 2020లో పనులు ప్రారంభించారు. దాదాపు రెండు కిలో మీటర్ల పొడవునా రోడ్డును మొత్తం తవ్వి కంకర పరిచారు. బిల్లు రాక పోవటంతో ఆ పనులను నిలిపివేశారు. చేసిన పనులకు విడతలు వారిగా రూ. 40లక్షలు చెల్లించారని సమాచారం. రోడ్డు పనులను అర్థంతరంగా నిలిపివేశారు. రూ. 40 లక్షలకు కనీసం 40 అడుగుల రోడ్డు కూడా వేయలేదు. వైసీపీ నాయకులు, గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రోడ్డు పనులు నిలిచి పోవటంతో రోడ్డుకు ఇరు వైపులా ఉన్న పొలాల్లో దుమ్ము ధూళికి పంటలు పండకుండా పోతున్నాయి. మిరప రైతుల కష్టాలు చెప్పలేని విధంగా మారాయి. కాయలు ఎర్రగా మారుతున్న సమయంలో దుమ్ము ధూళి నిండిపోతుండడంతో కాయలు రంగు మారకుండా పోతున్నాయి. కాయలు రంగు ఉంటేనే మంచి ధరలు వస్తాయి. లేదంటే దళారులకు తక్కువ ధరకే అమ్ముకోవాల్సి ఉంటుందని పాల్తూరు-కరకముక్కల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి తమ కష్టాలను గుర్తించి రోడ్డు పనుల చేపట్టాలని రైతులు కోరుతున్నారు. నిత్యం వాహనాలు తిరిగే రోడ్డుపై కంకర దుమ్ము లేస్తూ ఉండటంతో మిరప పొలాలు మొత్తం తెల్లగా మారిపోతున్నాయి.



ఎర్రమిరప కాయలపై పడిన ధూళి

తెల్లగా మారుతున్న మొక్కలు



రోడ్డుపై నుంచి వచ్చే దుమ్ము ధూళి మొత్తం మిరప మొక్కల పైనే పడుతోంది. దీంతో మొక్కలు తెల్లగా మారి పోతున్నాయి. కాయలు ఎర్రగా మారుతున్న సమయంలో దుమ్ము వల్ల రంగు మారే పరిస్థితి లేకుండా పోయింది. ప్రభుత్వం వెంటనే రోడ్డు పనులు చేయించి పంటలను కాపాడాలి. రోడ్డు పనులు చేపట్టక పోతే కనీసం దుమ్ము రాకుండా రోడ్డుపై ట్యాంకర్ల ద్వారా నీటిని చల్లించాలి.

- నాగరాజు, రైతు, పాల్తూరు

పంటలు చేతికి రాలేదు



కరకముక్కల-పాల్తూరు రోడ్డు పనులను నాలుగు సంవత్సల క్రితమే ప్రారంభించారు. పనులు ఏ మాత్రం ముందుకు సాగలేదు. కంకర వేసి వదిలేయడంతో.. దాని నుంచి వచ్చే తెల్లటి మట్టి వాహనాలు తిరిగే సమయంలో దుమ్ముగా మారి రోడ్డు పక్కనే ఉన్న పంట పొలాల్లోకి వస్తోంది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న మిరపపై దుమ్ము పడుతుండడంతో పంట చేతికి రాకుండా పోతోంది. అధికారులు వెంటనే స్పందించి రోడ్డు పనులు చేపట్టాలి.

- సురేష్, రైతు, పాల్తూరు

రోడ్డు పనులు పూర్తి చేయాలి



రోడ్డు పనులు పూర్తిచేయక పోవటంతో దుమ్ము ధూళి మిరప కాయలపై పడి రంగు మారకుండా ఉన్నాయి. ఈ రోడ్డు పనులు ఎప్పుడు చేస్తారో అని ఆందోళనగా ఉంది. వాహనాలు ఎక్కువగా తిరుగుతుండడంతో దుమ్ము ఎక్కువగా వస్తోంది. దీంతో పంటలు పూర్తిగా దెబ్బ తింటున్నాయి. కాయలు చివరి దశలో ఉండటంతో వేలాది రూపాయలు నష్టాలపాలయ్యే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే రోడ్డు పనులు చేయాలి.

- దుర్గన్న, రైతు, పాల్తూరు

పుట్టగొడుగుల్లా వెంచర్లు

● అనుమతులు లేకుండా లే అవుట్లు

● చోద్యం చూస్తున్న అధికారులు





వ్యవసాయ భూమిలో వేసిన వెంచర్

ఉరవకొండ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇష్టారాజ్యంగా లే అవుట్లు వేస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. ఉరవకొండ పట్టణంతో పాటు మండలంలోని వివిధ ప్రాంతాల్లో భూమి ధరలు పెరగడంతో వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలు తుంగలోకి తొక్కి, గ్రామ పంచాయతీలు, అహుడా అనుమతులు లేకుండానే రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లు వేసి, యథేచ్ఛగా ప్లాట్లు క్రయవిక్రయాలు చేస్తున్నారు. వ్యవసాయభూముల్లో వెంచర్లు వేయాలంటే ముందుగా ల్యాండ్ కన్వర్షేషన్ కోసం రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. తర్వాత అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి భూములను పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా అనుమతులు మంజూరు చేస్తారు. ఉరవకొండలో మాత్రం నిబంధనలు ఏమీ పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవసాయభూముల్లో ప్లాట్లు వేసి, రియల్ ఎస్టేట్ వ్యాపారులు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఉరవకొండ సమీపంలోని అనంతపురం- బళ్లారి రహదారికి ఆనుకుని అనుమతులు లేకుండా లేఅవుట్‌లు వేశారు. ఇటీవల ఉరవకొండ సమీపంలోని ఇంద్రావతి రహదారిలో ఓ వెంచర్ వేశారు. నల్లరేగడి పొలం కావడంతో ఆ పొలమంతా గరుసు మట్టితో చదును చేసి ప్లాట్లు వేశారు. పంచాయతీ అనుమతి కానీ, అహుడా అనుమతి కానీ తీసుకోలేదు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై తహసీల్దారు మహబూబ్‌బాషాను వివరణ కోరగా.. ఇటీవల వ్యవసాయ భూములేవీ ల్యాండ్ కన్వర్షేషన్ చేయలేదని పేర్కొన్నారు. అనుమతులు లేకుండా వెంచర్లు వేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

‘పరపతి’ కోసం పైరవీలు..!

ఏడేళ్లుగా ఎన్నికలు లేవు

- పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీలు
- పెరిగిన ఆశావహులు
- త్వరలో పదవుల పంపకాలు
- కూటమి శ్రేణుల ఎదురుచూపు



కంబదూరు సహకార సంఘం కార్యాలయం →

కళ్యాణదుర్గం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల (పీఏసీఎస్) పాలక వర్గాలకు ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించే పరిస్థితి కనిపించడం లేదు. ఆరు నెలల పాటు త్రిసభ్య కమిటీలతో సొసైటీలను నడపాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రాథమిక సహకార సంఘాల్లో పదవులు దక్కించుకునేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారు. తమనే సొసైటీ ఛైర్మన్‌గా నియమించాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఎవరికి వారు తమ ప్రయత్నాలు గట్టిగా చేస్తున్నారు.

ఏడేళ్లుగా ఎన్నికలు లేవు

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు చివరిగా 2013 ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగాయి. 2018లో పదవీ కాలం ముగియగా అప్పట్లో ఎన్నికలు నిర్వహించలేదు. ఆ తర్వాత 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం త్రిసభ్య కమిటీలను తెరపైకి తీసుకొచ్చింది. గతేడాది జూలై నెలాఖరుతో వీరి పదవీకాలం ముగిసింది. ఆ వెనువెంటనే కూటమి ప్రభుత్వం తాత్కాలికంగా సహకార సంఘాలకు స్పెషలాఫీసర్లను నియమించింది. కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం, బెళుగుప్ప మండలాల్లో ఉన్న సహకార సంఘాల్లో స్పెషలాఫీసర్లతో కార్యాలయాలను ఇప్పటి వరకు నడుపుతున్నారు. పాలకవర్గం గడువు ముగిసి ఏడేళ్లవుతున్నా ప్రాథమిక సహకార సంఘాలకు రెగ్యులర్ పాలకవర్గాలు లేవు. ప్రస్తుతం స్పెషలాఫీసర్లతో సహకార సంఘాలను నెట్టుకొస్తున్నారు.

త్వరలో పదవుల పంపకాలు

ప్రాథమిక సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఒక్కో సొసైటీకి ఒక ఛైర్మన్, ఇద్దరు డైరెక్టర్లను నియమించేందుకు కసరత్తు చేస్తోంది. ఇప్పటికే అధిష్టానానికి స్థానిక ఎమ్మెల్యే నుంచి ప్రతిపాదనలు కూడా పంపారు. ఆ మేరకు నియమించే ప్రక్రియయ కూడా ఓ కొలిక్కి వస్తున్నట్లు తెలుస్తోంది. ఏడేళ్లుగా సొసైటీల వ్యవస్థ అంతా చిన్నాభిన్నంగా మారిపోయింది. రెగ్యులర్ పాలకవర్గం లేక పరిపాలన అంతా చతికిలపడిపోయింది. వైసీపీ ప్రభుత్వంలో సొసైటీలకు జీవం లేకుండా చేశారు. కూటమి ప్రభుత్వంలో ఈ సొసైటీలకు పునర్జీవం పోయనున్నారు.

కూటమి శ్రేణుల ఎదురుచూపు

ప్రస్తుతం సొసైటీల అధ్యక్ష, డైరెక్టర్ల స్థానాలకు గ్రామస్థాయి నుంచి పలువురు పోటీ పడుతున్నారు. తెలుగుదేశం పార్టీలో ఆశావహులు పెరిగిపోయారు. దీనికితోడు జనసేన, బీజేపీ నేతలు సైతం పదవులు ఆశిస్తున్నారు. త్వరలోనే ప్రభుత్వం నుంచి సొసైటీల పాలవర్గం ఏర్పాటుపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వంలో సొసైటీలకు కొత్తరూపురేఖలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కంప్యూటరీకరణ దిశగా సొసైటీలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రతి సొసైటీని కంప్యూటరీకరణ చేసే దిశగా ముందుకు సాగుతున్నారు. ఈ మేరకు కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కళ్యాణదుర్గం, కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, బెళుగుప్ప మండలాల పరిధిలోని ప్రతి సొసైటీని కంప్యూటరీకరణ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ఆయా సొసైటీల్లో ప్రక్రియ మొదలయింది. గ్రామీణ బ్యాంకుల మాదిరిగా మార్చి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అన్ని సౌకర్యాలు అందించే అవకాశాలు ఉన్నాయి. సహకార వ్యవస్థలను బలోపేతం చేసేదిశగా కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది.

ఈ-పంట నమోదును వేగవంతం చేయాలి

జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీ ఈ పంట నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. స్థానిక జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో బుధవారం ఆమె ఏడీఏలు, ఏఓలతో సమావేశమయ్యారు. జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి ఇప్పటి దాకా 209462 ఎకరాలకుగాను 169663 ఎకరాలకు ఈ పంట నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే 90774 మంది రైతులతో ఈకేవైసీ పూర్తి చేశారన్నారు. మిగిలిన విస్తీర్ణంలో ఈ పంట నమోదుతోపాటు రైతులతో వంద శాతం ఈకేవైసీ చేయించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కిసాన్ డ్రోన్‌కు సంబంధించి కొత్త రైతు గ్రూపులు, పైలెట్‌లను గుర్తించి, శిక్షణనిచ్చేలా చూడాలన్నారు. రైతులకు సంబంధించిన భూముల రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల మ్యాపింగ్ త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ పంట సూపర్ చెక్ వివరాలు యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. పీఎం కిసాన్ ఫిర్యాదులను పరిశీలించి, వాటిని లాగిన్‌లో నమోదు చేయాలన్నారు. రైతుల ఆత్మహత్యలకు సంబంధించిన దరఖాస్తులను గ్రామ, మండల, డివిజన్ స్థాయి కమిటీ సభ్యులతో పరిశీలించి, ఆన్‌లైన్ ద్వారా పంపేలా చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏఓలు వెంకట్‌కుమార్, బాలూనాయక్, రాకేష్, ఏడీఏలు, ఏఓలు పాల్గొన్నారు.



ఇళ్లను కొల్లగొట్టిన

దొంగలు

రియల్టర్ ఇంట్లో రూ.3.50 కోట్ల ఆభరణాలు

రూ.20 లక్షల నగదు

మరో రెండు ఇళ్లలో కూడా..

వివరాలు మెయిన్‌లో...

నిప్పుకణిక



పరిటాల రాకే పెను సంచలనం

ఇంటి నుంచే ఉమ్మడి జిల్లా రాజకీయం

ఆ నాలుగు అక్షరాలకు వెలకట్టలేని అభిమానం

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి

రేపు పరిటాల రవి 20వ వర్ధంతి

వివరాలు 4లో...

నిప్పు కణిక...

పరిటాల రాకే పెను సంచలనం

మాజీ మంత్రి పరిటాల రవీంద్ర అంటే ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో పెను సంచలనం. విలక్షణ వ్యక్తిత్వంతో దశాబ్దం పాటు జిల్లా రాజకీయాలను శాసించిన ధీశాలి. బదుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా నిరంతరం పోరాటం చేసిన ఆయన దివంగతుడై రెండు దశాబ్దాలు పూర్తవుతోంది. ఈ నెల 24న పరిటాల రవీంద్ర వర్ధంతి. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

– ఆంధ్రజ్యోతి, అనంతపురం

ఆయన్ను చూస్తే...ధైర్యం
రొమ్ము విరుచుకుని నవ్వుతుంది.
ఆపేరు కలలో వచ్చినా...
ప్రత్యర్థులకు నిద్ర కరువవుతుంది.
సాహసానికి మారుపేరుగా...
సంచలనాలకు చిరునామాగా..
అన్యాయాలు, అరాచకాలు,
అకృత్యాలకు సింహస్వప్నంగా..
బడుగు, బలహీన
వర్గాలకు కొండంత అండగా
పెత్తందార్ల ఆగడాలను
దహించే నిప్పు కణికగా ..
కారు చీకట్లను చీల్చిన మెరుపుగా..
కష్టాలు, కన్నీళ్లు, ఆకలి, అన్యాయాలకు
ఎదురొడ్డి పోరాడిన ధీరుడిగా..
పేదింటి ఆడబిడ్డలకు
పెళ్లిళ్లు చేసిన పెద్దకొడుకుగా..
నమ్మిన సిద్ధాంతం కోసం
ప్రాణాలొడ్డిన త్యాగమూర్తిగా..
ఆయన పేరు
చిరస్మరణీయం..స్ఫూర్తిదాయకం
ఆయనే దివంగత పరిటాల రవీంద్ర
ఆయన రాకే జిల్లా
రాజకీయాల్లో ఓ ప్రభంజనం
అనతి కాలంలోనే
జిల్లా రాజకీయానికి
కేరాఫ్ అడ్రస్‌గా నిలిచి
విలక్షణ వ్యక్తిత్వంతో ప్రజలకు
అభిమాన నాయకుడయ్యారు.
మరణించీ అభిమానుల గుండెల్లో
అస్తమించని 'రవి'గా మారాడు.



ఆంధ్రజ్యోతి పేపర్‌ను చదువుతున్న పరిటాల రవీంద్ర (ఫైల్)





- ఇంటి నుంచే ఉమ్మడి జిల్లా రాజకీయం
- ఆ నాలుగు అక్షరాలకు వెలకట్టలేని అభిమానం
- బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి
- పదేళ్ల రాజకీయం... వారసత్వానికి బాసట

రేపు పరిటాల రవీంద్ర 20వ వర్ధంతి

తండ్రి పరిటాల శ్రీరాములు బాటలోనే...

పరిటాల శ్రీరాములు, నారాయణమ్మ దంపతులకు పరిటాల రవీంద్ర 1958 ఆగస్టు 30న జన్మించారు. రామగిరి మండలం నసనకోట పంచాయతీ పరిధిలోని వెంకటాపురం ఆయన స్వగ్రామం. ఆ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీకి, నక్సలైట్ ఉద్యమానికి అండాదండా పరిటాల రవీంద్ర కుటుంబం. తండ్రి పరిటాల శ్రీరాములు కమ్యూనిస్టు నాయకులు. ఆ ప్రాంతంలో జరిగే అన్యాయాలు, భూస్వాముల పెత్తందారి విధానాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించేవారు. ఆయన మరణానంతరం వారసత్వంగా వచ్చిన భావజాలాన్ని పరిటాల రవీంద్ర భుజానికి ఎత్తుకున్నారు. అప్పటికి ఆయన వయస్సు కేవలం 15 సంవత్సరాలు. ఆ వయస్సులోనే అరాచకాలకు ఎదురొడ్డి నిలిచారు. ఈక్రమంలో తనకు అండగా ఉండే సోదరుడు పరిటాల హరిని ఎన్‌కౌంటర్‌లో పోగొట్టుకున్నారు. భూస్వాములు, ఫ్యాక్షనిస్టుల వేధింపులు అధికమయ్యాయి. అయినా వెరవలేదు. తండ్రి పరిటాల శ్రీరాములు ఏ ఆశయం కోసమైతే పనిచేశారో దాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకే అడుగులు వేశారు. ఈ కాలక్రమంలో అనేక సంఘటనలు జరిగాయి. అప్పటి మాజీ ఎమ్మెల్యే గంగుల నారాయణరెడ్డి హత్య కేసులో పరిటాలను ప్రధాన ముద్దాయిగా చేర్చడంతో అజ్ఞాత జీవితం గడపాల్సి వచ్చింది. అయినప్పటికీ తన కుటుంబానికి బాసటగా ఉంటూ వచ్చిన జనాన్ని సంఘటితం చేసుకుంటూ ఆ వర్గాలకు వెన్నుదన్నుగా నిలిచారు. నేనున్నానంటూ బడుగు, బలహీన, పీడిత వర్గాలకు అండగా నిలబడ్డారు.




మలుపు తిప్పిన 1983 ఎన్నికలు

ఉమ్మడి రాష్ట్రంలో 1983లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు పరిటాల రవీంద్ర జీవితాన్ని అనుకోని మలుపులు తిప్పాయి. అప్పటి వరకూ కాంగ్రెస్ పార్టీ పాలన సాగించింది. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రేసేతర ప్రభుత్వాన్ని స్థాపించి ఆంధ్రుల అభిమాన నటుడు ఎన్టీ రామారావు ముఖ్యమంత్రి అయ్యారు. దీంతో రాష్ట్ర రాజకీయాల్లో ఒక నూతన ఒరవడికి బీజం పడింది. అప్పటి వరకూ అజ్ఞాత జీవితం గడుపుతున్న పరిటాల రవీంద్ర 1984లో తన స్వగ్రామం వెంకటాపురం చేరుకున్నారు. అదే సమయంలో అక్టోబరు 27న సునీతను వివాహం చేసుకున్నారు. పరిటాల రవీంద్ర తండ్రి పరిటాల శ్రీరాములు హత్య కేసులో ప్రధాన ముద్దాయి సిద్దప్ప శిక్ష ముగించుకొని జైలు నుంచి బయటికి వచ్చాడు. 1986లో సిద్దప్పను నక్సల్స్ కాల్చి చంపారు. ఈ హత్య కేసులో పరిటాల రవిని ముద్దాయిని చేయడంతో మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లారు. రహస్య జీవితం గడుపుతూనే... అప్పటి నక్సలైట్ ఉద్యమ ప్రముఖుడు కొండపల్లి సీతారామయ్యతో సన్నిహిత సంబంధాన్ని నడిపారు. ఈక్రమంలోనే సిద్దప్ప హత్య కేసు నుంచి బయటపడి తిరిగి వెంకటాపురానికి చేరుకున్నారు. తండ్రి శ్రీరాములు, సోదరుడు హరి సాగించిన భూస్వామ్య వ్యతిరేక పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లడమే తన కర్తవ్యంగా భావించారు. అదే సందర్భంలో ఫ్యాక్షనిజాన్ని నిర్మూలించాలనే లక్ష్యంగా అడుగులు వేశారు. అందుకు అవసరమైన వనరులును సమకూర్చుకునే మార్గాల మీద దృష్టి సారించారు. ఆ క్రమంలో ఆయనకు ప్రత్యేక రక్షణ వ్యవస్థ ఏర్పడటంతో ప్రజానాయకుడిగా తొలి అడుగు వేశారు. రాష్ట్రంలోనే తొలి మండల వ్యవస్థ ఎన్నికలు జరగడంతో ఆ ఎన్నికల్లో పరిటాల రవీంద్ర వంద్దతంతో దళిత ఓబన్న అత్యధిక మెజార్టీతో రామగిరి మండల అధ్యక్ష పదవి దక్కించుకున్నాడు. అక్కడి నుంచి ఆయన ప్రజా నాయకుడిగా ప్రజల్లోకి వచ్చారు. ఆ తరువాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడంతో పరిటాల రవీంద్రపై ప్రత్యర్థులు కక్షగట్టారు. అయినా తాను నమ్మిన సిద్ధాంతాన్ని పరిటాల వీడ లేదు. కాంగ్రెస్ నాయకుల అరాచకాలకు ఎదురొడ్డి నిలిచాడు. ఈ క్రమంలో ప్రజల దృష్టిని మరింత ఆకర్షించాడు. రవీంద్రకి రోజు రోజుకు ప్రజా బలం పెరుగుతుండటంతో అతన్ని నక్సలైట్‌గా చిత్రీకరించి మట్టుపెట్టాలనే ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆయనకు సమాచారం అందింది. దీంతో అప్పటి ఎస్పీ కెప్టెన్ కేవీ రెడ్డి సమక్షంలో 1992లో పోలీసుల ఎదుట లొంగిపోయాడు. ఆ మరుసటి రోజు నుంచే పరిటాల రవీంద్ర క్రియాశీల రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రచారం జోరందుకుంది.



జైలులో నుంచే నామినేషన్.. ఎమ్మెల్యేగా విజయం

1994 ఆగస్టు 7న హైదరాబాదు సమీపంలోని షాద్‌నగర్‌లో జంట హత్యలు జరిగాయి. హతులిద్దరూ అప్పటి పెనుకొండ ఎమ్మెల్యే ఎస్వీ రమణారెడ్డి అనుచరులు కావడంతో ఆ కేసులో పరిటాల రవిని ప్రధాన ముద్దాయిగా చేశారు. జైలు నుంచే పెనుకొండ నియోజకవర్గానికి టీడీపీ అభ్యర్థిగా పరిటాల రవీంద్ర నామినేషన్ వేశారు. అన్ని అవాంతరాలను అధిగమించి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందాడు. రాష్ట్రంలోనూ తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రి ఎన్టీఆర్ మంత్రివర్గంలో కార్మికశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టాడు. ఆ తరువాత జరిగిన పరిణామాల నేపథ్యంలో... రాజకీయ సంక్షోభం రావడం... చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం వరుసగా జరిగిపోయాయి. ఎన్టీఆర్ మరణించిన తర్వాత ఎమ్మెల్యే పదవికి పరిటాల రవీంద్ర రాజీనామా చేశారు. తిరిగి ఉప ఎన్నికల్లో చంద్రబాబు నాయకత్వంలోని టీడీపీ తరఫున విజయం సాధించాడు. అప్పటి నుంచి ఉమ్మడి జిల్లా రాజకీయాల్లోనే కాదు... రాష్ట్ర రాజకీయాల్లో పరిటాల రవీంద్ర తనకంటూ ఒక సుస్థిర స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. ఉమ్మడి జిల్లాలో తెలుగు దేశం పార్టీలో తిరుగులేని నాయకుడిగా ఎదిగారు. ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో బడుగు, బలహీన వర్గాలకు సముచిత స్థానం కల్పించిన నాయకుడిగా ఆ వర్గాల్లో అభిమానాన్ని చాటుకున్నాడు. వేలాది మంది పేదింటి బిడ్డలకు ఉచిత పెళ్లిళ్లు చేసి ఆ కుటుంబాలకు పెద్ద దిక్కయ్యాడు. మరెన్నో సామాజిక సేవా కార్యక్రమాలతో చైతన్యం నింపారు. ఆయన రాజకీయాల్లో పదేళ్లు ఉన్నా ఆ కుటుంబానికి వెయ్యేళ్ల వారసత్వ రాజకీయాన్ని అందించారు. 2004లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆయనను అంతమొందించేందుకు ప్రయత్నాలు జరిగాయి. ఈ విషయం తెలిసినా వెరవక ప్రజల కోసం నిలబడ్డాడు. ఆ క్రమంలోనే 2005 జనవరి 24న హత్యకు గురయ్యారు. అయితే బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, తన ప్రాంత అభివృద్ధి కోసం పరిటాల రవీంద్ర ఎలా పాటుపడ్డారో అవిధంగానే ఆయన సతీమణి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆయన తనయుడు పరిటాల శ్రీరామ్‌లు కృషి చేస్తున్నారు.



సీఎం చంద్రబాబు నాయుడుతో (ఫైల్)



భార్య పరిటాల సునీతతో (ఫైల్)

చెస్‌లో చిచ్చర పిడుగు

అంతర్జాతీయ పోటీలకు అరవ విశ్వాణి



రన్నరప్ ట్రోఫీతో అరవ విశ్వాణి

అనంతపురం క్లాక్‌టవర్/గుంతకల్లు టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఏషియన్ స్కూల్స్ చెస్ చాంపియన్‌షిప్-2025, ఫిడే వరల్డ్ స్కూల్ చెస్ చాంపియన్ షిప్-2025 పోటీలకు గుంతకల్లుకు చెందిన అరవ విశ్వాణి అర్హత సాధించింది. ఇటీవల కాకినాడలో నిర్వహించి న నేషనల్ చెస్ పోటీల్లో ఈమె రన్నరప్ టైటిల్ కైవసం చేసుకున్నారు. త్వరలో ఏషియన్, వరల్డ్ స్కూల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీల తేదీ, వేదికను ప్రకటిస్తారని ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్, గౌరవాధ్యక్ష డు బాలరాజు తెలిపారు. గుంతకల్లులోని ఓ ప్రైవేటు పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న బాలికను చెస్ అసోసియేషన్ కోశాధికారి కిశోర్, ఇంటర్నేషనల్ ఆర్బిటార్ ఉదయ్‌కుమార్‌నాయుడు, ఆంధ్రా చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి నాగార్జున తదితరులు అభినందించారు.

మెరుగైన మార్కులు సాధించండి: డీఈఓ

అనంతపురం విద్య, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదుకుని టెన్త్‌లో మంచి మార్కులు సాధించాలని డీఈఓ ప్రసాద్‌బాబు సూచించా రు. రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎస్టీయూ స్టడీమెటీరియల్ పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. డీఈఓ ప్రసాద్‌బాబు, సంఘ సేవకురాలు ఏజీ ప్రమీలమ్మ చేతులమీదుగా వీటిని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుభవజ్ఞులు, నిపుణులైన టీచర్లు తయారు చేసిన మెటీరియల్‌ను విద్యార్థులకు ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. ఎస్టీయూ నాయకులు మాట్లాడుతూ సుమారు 500 మంది విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్ పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రేణుక, ఎస్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి రామాంజనేయులు, రాష్ట్ర మున్సిపల్ కమిటీ కన్వీనర్ ఫణిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

అర్చకుల ఆగ్రహం

- సహాయ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్
- అనంతలో అర్చక, పురోహితుల నిరసన
- దేవదాయశాఖ ఏసీ కార్యాలయం వద్ద ధర్నా



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల అర్చకులు, పురోహితులు

అనంతపురం కల్చరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అర్చక పురోహితుల పట్ల నీచంగా ప్రవర్తిస్తున్న జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్ ఆదిశేష నాయుడును వెంటనే సస్పెండ్ చేయాలని ఉమ్మడి అనంతపురం జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు వైపీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. సహాయ కమిషనర్ తీరును నిరసిస్తూ బుధవారం ఉమ్మడి జిల్లాలోని అర్చక పురోహితులు నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ హెచ్చెల్సీ కాలనీలో తహసీల్దార్ కార్యాలయం నుంచి దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయం వరకు సాగింది. అనంతరం సహాయ కమిషనర్ కార్యాలయం లో సూపరింటెండెంట్ రామతులసిని కలిసి వినతిపత్రం సమర్పించారు. అక్కడి నుంచి కలెక్టరేట్‌కు వెళ్లి జేసీ శివనారాయణశర్మను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వైపీ ఆంజనేయులు మాట్లాడు తూ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా డెత్ గ్రాట్యుటీ ఫైల్స్‌ను గత మూడేళ్లగా క్లియర్ చేయకుండా సహాయ కమిషనర్ జాప్యం చేస్తున్నాడని విమర్శిం చారు. అర్చకుడు మృతి చెందితే ఆ కుటుంబంలోని వారికి డీడీఎన్‌ఎస్ పథకం వర్తింపజేయాల్సి ఉన్నా ఆమేరకు చర్యలు చేపట్టడం లేదన్నారు. సమస్యలపై అర్చకులు సహాయ కమిషనర్ కార్యాలయానికి వస్తే వారిని కలవకుండానే వెనక్కు పంపేస్తున్నారన్నారు. సమస్యలపై ప్రశ్నిస్తే అర్చకులు, ఆఖరుకు ఈఓ స్థాయి అధికారులపైనా బూతులతో విరుచుకు పడుతున్నాడన్నారు. సమస్యలు పరిష్కరించకుండా అర్చకుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఆదిశేషనాయుడును వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అర్చక సమాఖ్య ఉపాధ్యక్షుడు మారుతీప్రసాద్, కోశాధికారి శ్రీనివాసులు, చేతన్, నవీన్, హనుమంతరాయుడు, గోపాల్, తిరుపతయ్య, చంద్రమౌళి, వెంకటగిరి, మాధవయ్య, రంగనాయకులు, వీరాంజనేయులు, రాజన్న, సునీల్, ప్రజ్వల్, కిరణ్‌స్వామి, విజయ్, ప్రకాష్, వెంకటరాముడు, విజయశాంతి పాల్గొన్నారు.

27న రాయలసీమ కలెక్టరేట్‌ల వద్ద ధర్నా: సీపీఎం

అనంతపురం కల్చరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ వెడల్పును కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో రాయలసీమ వ్యాప్తంగా ఈనెల 27న అన్ని కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పేర్కొన్నారు. అనంతపురంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హంద్రీనీవా ప్రాజెక్టు కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, మదనపల్లి జిల్లాల్లో దాదాపు ఆరు లక్షల ఎకరాలకు పైగా నీళ్లు ఇవ్వడానికి ఉద్దేశించబడింద న్నారు. 2012 నుంచి కర్నూలు, అనంతపురం జిల్లాలకు నీరు వస్తున్నా ఒక్క ఎకరం ఆయకట్టుకూ సాగునీరు ఇవ్వకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. మొదటిదశ కింద అనంతపురం జిల్లాలో 3.45 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరిచ్చేందుకు పంటకాల్వలు తవ్వలేదన్నా రు. ప్రభుత్వాలు మారుతున్నా రాయలసీమ సాగునీటి వనరుల అభివృద్ధి మాత్రం ఆశించినంతగా జరగడం లేదన్నారు. హంద్రీనీవా నుంచి 10వేల క్యూసెక్కుల నీరు రావడానికి కాలువ వెడల్పు చేయాల్సిన అవసరముందన్నారు. అయితే కాలువ వెడల్పు చేయకుండా లైనింగ్ వేయడానికి టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రస్తుతం జీఓ నెం.404, 405 విడుదల చేసిందన్నారు. అయితే కాలువ వెడల్పు చేయకుండా ఇది సాధ్యం కాదన్నారు. లైనింగ్ పనులవల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదముందని రైతుసంఘాలు, జలసాధన కమిటీ, ఇతర రాజకీయ పార్టీలు ఆందోళన చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. కలెక్టరేట్‌ల వద్ద చేపట్టే ధర్నాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, చంద్రశేఖర్ రెడ్డి, కృష్ణమూర్తి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

మహారాష్ట్ర వ్యక్తి హత్య

డి.హీరేహాళ్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళాపురం గ్రామ పరిసర ప్రాంతాల్లో మహారాష్ట్రకు చెందిన పల్లి శంకర్‌బోస్లే(40) అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు మహారాష్ట్రలోని నీరజ్ గ్రామానికి చెందిన పది మంది 15 రోజుల కిందట గ్రామ సమీపంలో టెంట్లు వేసుకొని ఉండేవారు. రెండురోజుల కిందట వారంత అక్కడి నుంచి వేరే ప్రాంతానికి వెళ్లిపోయారు. అయితే బుధవారం సాయంత్రం ఓబుళాపురం గ్రామానికి చెందిన కొందరు కాపరులు గొర్రెలను మేపుతూ గ్రామం వైపు వస్తుండగా చెట్ల కింద ఒక వ్యక్తి పడి ఉండటం గమనించారు. దగ్గరికి వెళ్లి చూడగా ఆ వ్యక్తిపై రక్తపు మరకలు ఉండటంతో విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. సీఐ వెంకటరమణ, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి ఒంటిపై కత్తిపోట్లు ఉన్నట్లు గుర్తించారు. చుట్టుపక్కల విచారించగా మృతుడు సంచారజాతికి చెందిన వ్యక్తి అని గ్రామస్థులు పేర్కొన్నట్లు తెలిపారు. పోలీసు డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేసి మృతదేహాన్ని బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్పీఎఫ్ గణతంత్ర స్ఫూర్తి యాత్ర



పాదయాత్రగా బయలుదేరిన ఆర్పీఎఫ్ అధికారులు, సిబ్బంది

గుంతకల్లు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవ స్ఫూర్తితో రైల్వే రక్షణ దళం విధి నిర్వహణలో పునరంకితం కావాలని ఆర్పీఎఫ్ డీఎస్సీ మురళీకృష్ణ పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంతకల్లు రైల్వే డివిజన్ ఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం గణతంత్ర దినోత్సవ స్ఫూర్తి యాత్రను చేపట్టారు. స్థానిక రైల్వే స్టేషన్ నుంచి ఈ మారథాన్ వాక్ ప్రారంభించి, పట్టణం మీదుగా చిప్పగిరి, అక్కడి నుంచి పెంచలపాడు మీదుగా గుంతకల్లుకు చేరే విధంగా 40 కి.మీ.ల పాదయాత్రను డీఎస్సీ ప్రారంభించారు. కార్యక్రమంలో గుంతకల్లు ఏఎస్‌సీ అనిల్ కుమార్ సింగ్, రేణిగుంట ఏఎస్సీ రాజగోపాల్ రావు, తదితరులు పాల్గొన్నారు.




డాకు మహారాజ్ కేక



యాంకర్ శ్రీముఖి, నటి ఊర్వశీ రౌతేలా ఉత్సాహం



అభిమానుల సమక్షంలో విజయోత్సవం

పాటపాడి.. తొడగొట్టి అలరించిన బాలయ్య

తరలివచ్చిన తారాగణం.. టీడీపీ నాయకులు



అనంతపురం కల్చరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): డాకు మహారాజ్ విజయోత్సవం వేలాది మంది అభిమానుల మధ్య అట్టహాసంగా జరిగింది. అనంతపురం శివారులోని శ్రీనగర్ కాలనీలో బుధవారం రాత్రి నిర్వహించిన వేడుకకు హీరో నందమూరి బాలకృష్ణ సహా చిత్ర యూనిట్ హాజరైంది. ఇబ్బందులు తలెత్తకుండా ఎస్పీ జగదీష్ చర్యలు తీసుకున్నారు. సాయంత్రం 7.20 గంటలకు ప్రారంభమైన వేడుక రాత్రి 11 గంటల వరకూ సాగింది. శ్రీముఖి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఎన్బీకే హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో బాలయ్య పాటలకు కళాకారులు నృత్య ప్రదర్శన చేశారు. బాలకృష్ణ 50 సంవత్సరాల సినీ ప్రస్థానానికి సంబంధించి 3డి యానిమేషన్ చిత్రాన్ని ప్రదర్శించారు. దర్శకుడు బాబీ విజిల్ వేస్తూ 'చిన్ని చిన్ని' పాటను, బాలకృష్ణ 'గణ గణ గణాగణ' పాట పాడుతూ అభిమానులను అలరించారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారధి, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, కాలవ శ్రీనివాసులు, ఎంఎస్ రాజు, బండారు శ్రావణిశ్రీ, అమిలినేని సురేంద్రబాబు, పల్లె సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్, మాజీ మేయర్ స్వరూప, రాయల్ మురళి, ఎన్బీకే హెల్పింగ్ హ్యాండ్స్ జగన్, టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకుడు తాజుద్దీన్, సంగా తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

రెట్టింపు హిట్‌తో వస్తా

గతంలో తాను తీసిన సినిమాలన్నీ విజయాన్ని తెచ్చిపెడితే డాకు మహారాజ్ మాత్రం విజయంతోపాటుగా ఆనందాన్ని, కోట్ల మంది అభిమానాన్ని తెచ్చిపెట్టిందని దర్శకుడు బాబీ కొల్లి అన్నారు. ప్రతి ఒక్కరూ ఇష్టపడి పనిచేయడం వల్లే ఇంతటి ఘన విజయాన్ని సాధించామని అన్నారు. డాకు మహారాజ్‌కు రెట్టింపు హిట్ కొట్టే సినిమాతో, రాష్ట్రాలు కాకుండా దేశాలు మాట్లాడే స్థాయిలో సినిమాతో వస్తానని అన్నారు.

- బాబి కొల్లి, దర్శకుడు

తరలివచ్చిన తారలు

డాకు మహారాజ్ సక్సెస్ మీట్‌కు నటుడు బాబీ డియోల్, హీరోయిన్లు ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధ శ్రీనాథ్, ఊర్వశీ రౌతేలా, బాలనటి వేదా అగర్వాల్, సంగీత దర్శకుడు తమన్, చిత్రదర్శకుడు బాబీ కొల్లి, నిర్మాత నాగవంశీ, డీఓపీ విజయ్ కార్తీక్ కన్నన్, రచయిత మోహన్ కృష్ణ వచ్చారు.

ఊపిరి ఉన్నంతవరకూ నటిస్తా: బాలకృష్ణ

అభిమానులు కాలర్ ఎగరేసి గర్వపడేలా చూసుకునే బాధ్యతను తన తండ్రి నందమూరి తారకరామారావు తనపై ఉంచారని బాలకృష్ణ అన్నారు. ఆయన స్ఫూర్తితో కొన ఊపిరి ఉన్నంతవరకూ నటిస్తానని, సందేశాత్మక చిత్రాలతో అలరిస్తానని అన్నారు. నటసార్వభౌముడు ఎన్టీఆర్ పుట్టిన తెలుగుగడ్డపై మనమంతా పుట్టడం ఎన్నో జన్మల పుణ్యఫలమని అన్నారు. వరుసగా మూడోసారి ఎమ్మెల్యేగా తనను గెలిపించిన సీమ బిడ్డలను మరవలేనని అన్నారు. తన అభిమానులే తన నిజమైన ప్రచారకర్తలు అని అన్నారు. దేశానికి ఒక రాష్ట్రపతిని, ఉమ్మడి రాష్ట్రానికి ఆరుగురు ముఖ్యమంత్రులను ఇచ్చిన రాయలసీమ.. రాయల్ సీమ అని అన్నారు.

చెప్పాం.. కొట్టాం.. : ఎస్ఎస్ థమన్


డాకు మహారాజ్‌తో హిట్ కొడతామని, అనంతపురంలో సక్సెస్ మీట్ పెడతామని ప్రీ రిలీజ్ సమయంలోనే చెప్పామని సంగీత దర్శకుడు థమన్ అన్నారు. అన్నట్లుగానే హిట్ కొట్టామని, అనంతపురంలో సక్సెస్ మీట్ పెట్టామని అన్నారు.

బాలకృష్ణ సహకారంతో విజయం: దగ్గుపాటి

ప్రీ రిలీజ్ ఫంక్షన్ ఆగినచోటే విజయోత్సవం జరుపుకోవడం ఎంతో సంతోషాన్నిచ్చిందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యేగా తన విజయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, లోకేష్‌తోపాటు బాలకృష్ణ సహకారం ఉందని తెలిపారు.

బాలయ్య పేరుతోనే చదువు: గౌస్‌మొద్దీన్

అందరూ తమ పుస్తకాల్లో దేవుడిపేరు రాసుకుని చదువుకుంటారని, తాను మాత్రం ఎన్బీకే అని రాసుకుని చదువుకున్నానని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొద్దీన్ అన్నారు. బాలకృష్ణ అంటే తనకు అంత అభిమానమని అన్నారు.






బాలకృష్ణకు పాదాభివందనం చేస్తున్న థమన్

నా అభిమాన హీరో: ఎంఎస్ రాజు

చిన్నప్పటినుంచి తాను అభిమానించే హీరో నందమూరి బాలకృష్ణ అని, ఆయన సినిమా సక్సెస్‌మీట్‌లో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. తెలుగువారు ప్రపంచ దేశాల్లో ఎక్కడున్నా వారి నోట మార్మోగే ధ్వని 'జై బాలయ్య' అని అన్నారు. బాలకృష్ణ గురించి సోషల్ మీడియాలో ఏది వచ్చినా చివరి అక్షరం వరకూ చదువుతానని అన్నారు.

బాలకృష్ణతో ఎంపీ అంబికా





ఎగ్జిబిషన్లతో విజ్ఞానం: డీఆర్ఎం



వివిధ దేశాల పురాతన టైపు రైటర్లను తిలకిస్తున్న డీఆర్ఎం, ఏడీఆర్ఎం

గుంతకల్లు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఎగ్జిబిషన్లు విద్యార్థులకు వినోదాన్నే కాకుండా విషయ అవగాహనను కలిగిస్తాయని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని రైల్వే కమ్యూనిటీ హాలులో ద నుమిస్మాటిక్ సొసైటీ ఆఫ్ రాయలసీమ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పురాతన నాణేలు, వస్తువులు, ఫొటోగ్రాఫ్‌ల ఎగ్జిబిషన్‌ను డీఆర్ఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా రైల్వే, సెంట్రల్, ఇతర పాఠశాలల విద్యార్థులు ఎగ్జిబిషన్‌కు వచ్చి బ్రిటీష కాలం నుంచి ఇప్పటి వరకూ దేశంలో ముద్రించిన కరెన్సీ, నాణేలు, ఇతర దేశాల లీగల్ టెండర్లు, వివిధ కాలాల్లో వినియోగంలో ఉన్న టైపు రైటర్లు, టెలిగ్రాం యంత్రాలు, కెమెరాలు, ప్రొజెక్టర్లు, బైనాక్యులర్లు, కంపాస్‌లను తిలకించారు. రైలింజన్ల చిత్రపటాల వింటేజ్ కలెక్షన్స్‌పై అవగాహన చేసుకున్నారు. ఈ ఎగ్జిబిషన్ శుక్రవారం వరకూ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం యు. సుధాకర్, ఏపీఓ మధుసూదనరావు, సొసైటీ ప్రతినిధులు బీజీఆర్ గుప్త, ఎల్ఎన్ ఫెర్నాండెజ్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ. 14

అనంతపురం రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 14తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు బుధవారం 450 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 10, కనిష్ఠ ధర రూ. 8 పలికినట్లు ఆయన తెలిపారు.

నకిలీ బంగారం ముఠా అరెస్ట్

రూ.21 లక్షల నగదు, 5 ద్విచక్రవాహనాలు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం

సోమందేపల్లి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): నకిలీ బంగారం హారాలు చూపి ప్రజలను మోసం చేసి డబ్బులతో ఉడాయించే ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు వివరాలను వెల్లడించారు. ఎక్స్‌కవేటర్‌తో పొలాలను దున్నుతుంటే పాతకాలంనాటి బంగారం హారాలు లభ్యమయ్యాయని నమ్మబలికి.. వాటిని తక్కువ ధరకే ఇస్తామని ఆశచూపి మోసం చేశారని తెలిపారు. హిందూపురం నుంచి పెనుకొండ వైపు వస్తున్నారని తెలిసి దారికాశామని అన్నారు. 10 మంది ముఠా సభ్యులు దోచుకున్న సొమ్మును పంచుకుంటుండగా వలపన్ని పట్టుకున్నామని తెలిపారు. అదుపులోకి తీసుకుని విచారిస్తే నేరాన్ని ఒప్పుకున్నట్లు వెల్లడించారు. దీనిపై కుప్పం మండలం పైపాళ్యంలో వెంకటేశ్, విడపనకల్లుకు చెందిన ఈరన్న అనే వ్యక్తులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వీరిని సోమందేపల్లి మండలం బ్రాహ్మణపల్లి వద్దకు పిలిపించి, మాటల్లో మభ్యపెట్టి వారి వద్ద నుంచి నగదు తీసుకుని ఉడాయించారని పేర్కొన్నారు. ఈ మేరకు సోమందేపల్లి పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారని అన్నారు. రెండు కేసుల్లో రూ.24 లక్షలు కాజేసినట్లు వివరించారు. నకిలీ హారాలతో మోసం



నకిలీ హారాలను చూపుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

చేసిన నిందితులు రాణా కిష్టబాబు, ఏఆర్ శాంతరాజు, నయాజ్ అహ్మద్, ఎం. ఈరన్న, బాబు, షికారి అర్జున్, గోవిందుల ఆనంద్‌బాబు, సోమాల్‌బంగారి, ఈడిగ హరిప్రసాద్, పిచ్చిగుంట్ల మారెప్పను అరెస్ట్ చేసి కేసు నమోదుచేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.21 లక్షల నగదు, ఐదు బైక్‌లు, ఐదు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ రాఘవన్, ఎస్ఐ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వాచ్‌మన్ మృతి

ధర్మవరం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురం వద్ద ఓ గ్రానైట్ పరిశ్రమలో వాచ్‌మన్‌గా పనిచేస్తు న్న వారాదప్ప (68) బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాల మేరకు... చెన్నేకొత్తపల్లి మండలం గంగినేపల్లికి చెందిన వారాదప్ప గ్రానైట్ పరిశ్రమలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. తెల్లవారుజామున గ్రానైట్ నుంచి బయటకు వెళ్లాడు. చుట్టు పక్కల వారు గమనించి



మృతి చెందిన వారాదప్ప

గ్రానైట్ పరిశ్రమ యజమాని చంద్రకు సమాచారం అందించారు. ఆయన వన్‌టౌన్ పోలీసులకు తెలప డంతో సీఐ నాగేంద్రప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గ్రానైట్ పరిశ్రమ యజమానితో మృ తుడి వివరాలను అడిగితెలుసుకున్నారు. మృతుడు అనారోగ్యంతో మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి భార్య కిష్టమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణదాతకు సత్కారం

- సకాలంలో స్పందించిన వైద్యుడు
- కృతజ్ఞతలు తెలిపిన ఉపాధ్యాయులు

పామిడి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ఆసుపత్రికి వచ్చిన రోగిపట్ల సకాలంలో స్పందించి ప్రాణాలు నిలిపిన వైద్యుడు రాఘవేంద్రరెడ్డిని బుధవారం ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించింది. వివరాలలోకి వెళితే... గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న కె. నాగభూషణం ఈ నెల 3న విధి నిర్వహణలోనే ఛాతిలో నొప్పి రావడంతో సహోపాధ్యాయుడు కులశేఖర్‌రెడ్డి హుటాహుటిన పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విధుల్లో ఉన్న వైద్యుడు రాఘవేంద్ర రెడ్డి సకాలంలో స్పందించి ఎంతో విలువైన ఇంజెక్షన్‌ను ఉచితంగా వేసి ప్రథమ చికిత్స నిర్వహించి జిల్లా కేంద్రానికి రెఫర్ చేశారు. అనంతపురంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఉపాధ్యాయుడు నాగభూషణంకు స్టంట్ వేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. సకాలంలో గుండెపోటును గుర్తించి అవసరమైన చికిత్సను అందించి ప్రాణాలు కాపాడినందుకు ఆ పాఠశాల ఉపాధ్యాయుల బృందం వైద్యుడు రాఘవేంద్రరెడ్డికి శాలువాలు కప్పి పూలమాల వేసి ఘనంగా సత్కరించింది. వైద్యుడికి సహాయ సహకారాలు అందించిన స్టాఫ్ నర్సు శివకుమారి, నర్సులు సుధారాణి, రోహిణిని అభినందించారు. కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సి.ఆదినారాయణరెడ్డి, ఉపాధ్యాయులు గోపాల్‌నాయుడు, కులశేఖర్‌రెడ్డి, సీహెచ్‌సీ వైద్యాధికారి శివకార్తికేయరెడ్డి, వైద్యులు షర్మిల, కమలాధర్, మనీషా, మహేష్‌కుమార్ పాల్గొన్నారు.



పామిడిలో వైద్యుడిని సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

26న రాష్ట్ర స్థాయి క్విజ్, వ్యాసరచన పోటీలు

గొల్లపూడి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని ఎస్‌పీఎస్ఆర్‌సీ ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 26న 6 నుంచి పదో తరగతి విద్యార్థులకు వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మేథ 2025 పేరుతో క్విజ్, వ్యాసరచన, కథల పోటీలు నిర్వహించనున్నట్లు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ వడ్లమూడి రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. ఒక పాఠశాల నుంచి ముగ్గురితో కలిసి ఉన్న ఒక టీమ్ మాత్రమే పోటీల్లో పాల్గొనాలన్నారు. ఈ నెల 24 సాయంత్రం 5 గంటల లోపు ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు విద్యార్థుల పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9490336550ను సంప్రదించాలన్నారు.

వైసీపీ మడకశిర ఇన్‌చార్జిపై కేసు

జడ్పీటీసీ భూతరాజుపై ఈరలక్కప్ప వర్గీయుల దాడి

పోలీసులకు ఫిర్యాదు

గుడిబండ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ మడకశిర నియోజకవర్గ ఇన్‌చార్జి ఈరలక్కప్పపై పోలీసులు కేసు నమోదు చేశారు. గుడిబండ జడ్పీ టీసీ సభ్యుడు భూతరాజుపై ఈరలక్కప్ప వర్గీయులు మంగళవారం దాడి చే శారు. దీనిపై భూతరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. భూతరాజు పని నిమిత్తం రొళ్ల గ్రామానికి వెళ్లారు. గుడిబండవైపు తిరిగి వస్తుండగా.. ఈరలక్కప్ప స్వగ్రామమైన ఫళారంలో ఆయనతోపాటు కుటుంబ సభ్యులు.. త నపై దాడి చేశారని భూతరాజు ఆరోపించారు. అనంతరం గుడిబండ మాజీ జడ్పీటీసీ శివకుమార్ తనను కులం పేరుతో దూషించడమేకాక, నానా దుర్భా షలాడాడని పోలీసులకు భూతరాజు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఈరల క్కప్ప, ఆయన కుటుంబీకులు, మాజీ జడ్పీటీసీ శివకుమార్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. జడ్పీటీసీ భూతరాజు తమపై దాడి చేశారంటూ ఫళారం గ్రామానికి చెందిన లక్ష్మమ్మ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

న్యూస్ బాక్స్

సంపద సృష్టిపై దృష్టి సారించాలి

● డీపీఓ నాగరాజనాయుడు



వంకరాజుకాలువలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ

అనంతపురం న్యూటౌన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో చెత్తతో సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేందుకు సంబంధిత సిబ్బంది దృష్టి సారించాలని డీపీఓ నాగరాజనాయుడు ఆదేశించారు. సంపద తయారీకేంద్రాల వినియోగంపై కమిషనర్ కార్యాలయానికి వెళ్లివచ్చిన ఆయన బుధవారం పామిడి మండలంలోని వంకరాజు కాలువ పంచాయతీలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అనంతరం ఎంపీడీఓ తేజోష్ణ, ఈఓఆర్డీ కృష్ణకుమార్‌తో కలిసి పంచాయతీలోని చెత్తతో సంపద తయారీ కేంద్రాని పరిశీలించారు. అన్ని వసతులు ఉన్నాయని, వెంటనే సేకరించిన చెత్త నుంచి వర్మీకంపోస్టు ఎరువు ద్వారా సంపద సృష్టికి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని చెత్త సంపద తయారీ కేంద్రాలన్నీ ఫిబ్రవరి మూడో శనివారం నాటికి వినియోగంలో ఉండేలా చూడాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు.

● అనంతపురం రూరల్: చెత్తతో సంపద సృష్టికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ దివాకర్ పేర్కొన్నారు. ఆయన బుధవారం మండలంలోని చిన్నంపల్లిలో ఈఓఆర్డీ వెంకటనాయుడుతో కలసి పర్యటించారు. గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న పరిటాల రవీంద్ర ట్రస్టు వాటర్ ప్లాంట్‌ను సందర్శించారు. చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. పంచాయతీలో తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించి సంపద తయారీ కేంద్రంలో ఎరువులు తయారు చేయాలన్నారు. తద్వారా పంచాయతీ ఆదాయం పెంచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

● రాప్తాడు: మండలంలోని బుక్కచెర్ల గ్రామంలో చెత్తతో సంపద తయారు చేసే కేంద్రాన్ని ఎంపీడీఓ విజయలక్ష్మి బుధవారం పరిశీలించారు. తడి, పొడి చెత్త నుంచి వేర్వేరుగా వర్మీకంపోస్టు ఎరువు తయారు చేసే విధానాన్ని తెలుసుకున్నారు. చెత్తతో ఎరువు తయారు చేసి గ్రామ పంచాయతీ ఆదాయం పెంచాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఆనంద్ ప్రసాద్, ఏపీఓ సావిత్రి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మురళి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

● జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి

రాప్తాడు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి యుగందర్ తెలిపారు. ఆయన బుధవారం రాప్తాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. వ్యాక్సిన్లు భద్రపరిచే గదిని పరిశీలించారు. అలాగే హంపాపురం టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శివకృష్ణ, ఫార్మాసిస్ట్ మూర్తి, సీహెచ్ఓ శివప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



బుక్కచెర్లలో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ధర్మవరపు మురళి

రాప్తాడు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఊరూరా వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేసి ప్రజలకు సురక్షిత నీరు అందిస్తామని టీడీపీ మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి తెలిపారు. మండలంలోని బుక్కచెర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. రాప్తాడు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఎమ్మెల్యే పరిటాల సునీత వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయించి తక్కువ ధరకే ప్రజలకు సురక్షిత నీరు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, మాజీ మండల కన్వీనర్ నారాయణస్వామి, బ్రహ్మానందరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఓబిలేసు తదితరులు పాల్గొన్నారు.

డీఆర్వో మలోలపై చర్యలు తీసుకోవాలి

● ఎమ్మార్పీస్ నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నార్పల, జనవరి 22(ఆంధ్రజ్యోతి): డీఆర్వో మలోలపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ శింగనమల ఇన్‌చార్జ్ రంగాపురం పుల్లప్ప పేర్కొన్నారు. నార్పలలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏక సభ్య కమషన్ సమక్షంలోనే డీఆర్వో మలోల ఆల్‌లైన్ రమ్మీ ఆడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు. ఉన్నతాధికారులు డీఆర్ఓ మలోలపై కేసు నమోదు చేసి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి : సీపీఐ

నార్పల, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు ఆర్డీఓ కేశవనాయుడుకు విన్నవించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయానికి బుధవారం వచ్చిన ఆర్డీఓను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి సాకే గంగాధర మాట్లాడుతూ నార్పల మండల కేంద్రంలో సర్వే నంబర్లు 196, 197, 11లలో గత ప్రభుత్వంలో అనర్హులకు ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు. ఇప్పటికైనా అర్హులైన వారందరికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకలు సుధాకర్, నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పెద్దపెద్దయ్య, నారాయణప్ప, తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

అయోమయం..!

● నగరపాలికకు కమిషనర్ ఎవరు?
● సారా...? మేడమా..?
● మేడమ్ చెబితేనే సార్ చేస్తారట
● చాలా ఫైళ్లు పెండింగ్



నగరపాలిక కార్యాలయం

అనంతపురం క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నగరపాలికకు కమిషనర్ ఎవరని ప్రశ్నిస్తే... అటెండర్ నుంచి ఉన్నతాధికారుల వరకు ఎవరూ చెప్పలేని పరిస్థితి. అంతటి అయోమయం నెలకొంది. రెగ్యులర్ కమిషనర్ నాగరాజు దీర్ఘకాలిక సెలవులోకి వెళ్లడంతో, ఇన్‌చార్జ్‌గా వచ్చిన అడిషనల్ కమిషనర్ కూడా సెలవులో వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వాసుపత్రి అడ్మినిస్ట్రేటర్‌గా ఉన్న మల్లికార్జునరెడ్డిని ఇన్‌చార్జ్ కమిషనర్‌గా నియమించారు. ఆయనే ఫైనలా..? ఎవరినైనా రెగ్యులర్ అధికారిని నియమిస్తారా..? అని అనుకునేలోగా శిక్షణ నిమిత్తం వచ్చిన అసిస్టెంట్ కలెక్టర్ తాను ఇన్‌చార్జ్ కమిషనర్‌గా ఉంటానని స్పష్టం చేశారు. దీంతో పరిస్థితి అయోమయంలో పడింది. నగరపాలి కకు కమిషనర్ తెలియడంలేదు. కానీ సీసీలు ఏకంగా ముగ్గురున్నారు. వారందరూ సచివాలయ ఉద్యోగులే కావడం గమనార్హం. వారూ కొత్తగా వచ్చారు. వారు వచ్చిన నెలల వ్యవధిలోనే ముగ్గురు కమిషనర్లు మారారు. ఏ సమస్యనైనా ఎవరితో చెప్పుకోవాలో దిక్కుతోచని పరిస్థితి అధికారుల నుంచి సామాన్యుల వరకు ఏర్పడింది. ఇది నగరపాలికలో అయోమయం...జగన్నాథం అన్న సామెతను గుర్తుకు తెస్తోంది.

మేడమ్ చెబితేనే... సార్ చేస్తారట..!

తమ బిల్లులకు సంబంధించి ఫైళ్ల పెండింగ్‌పై కాంట్రాక్టర్లు ఇన్‌చార్జ్ కమిషనర్ మల్లికార్జునరెడ్డి వద్దకు వెళ్లారట. వాటిని చూసి ఆయన నిట్టూర్చి, తనపై అధికారి ఒకరున్నారని, మేడమ్ ఓకే చేస్తే తాను సంతకాలు పెడతానని చెప్పారట. ఇలా రెండు మూడు దఫాలుగా జరిగిందని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఇక మేడమ్ చాంబర్‌కు వెళ్దామంటే.. ఐఏఎస్ అధికారి కదా ఏమంటారోనని అధికారులు, పలు సెక్షన్ల హెచ్‌ఓడీలు సైతం వెనుకడుగు వేస్తున్నారట. కొన్ని రోజులుగా ఇప్పటివరకు ఒక్క ఫైల్ కూడా అప్రూవల్ కా లేదని సమాచారం. దీంతో అత్యవసకర విషయాల్లో ఎలా స్పందిస్తారోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఎవరికి అవగాహన ఉంది...?

నగరపాలికను ఎవరు నడిపిస్తున్నారో అర్థం కాని పరిస్థితి. గత ఏడాది డిసెంబరు 13న రెగ్యులర్ కమిషనర్ నాగరాజు సెలవులోకి వెళ్లారు. రామలింగేశ్వర్ జనవరి 7 నుంచి సెలవు బాట పట్టారు. ఈ సందర్భంలో కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రభుత్వాసుపత్రి అడ్మినిస్ట్రేటర్‌గా ఉన్న మల్లికార్జునరెడ్డిని ఇన్‌చార్జ్ కమిషనర్‌గా నియమించారు. సంక్రాంతి పండుగ అనంతరం శిక్షణ నిమిత్తం అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న వచ్చారు. కానీ ఆమె ఇన్‌చార్జ్ కమిషనర్ గా ఉంటారనే ప్రచారం జరిగింది. కానీ వీరిద్దరిలో ఎవరికీ నగరపాలికపై పూర్తి అవగాహన లేదనే విషయం సుస్పష్టం. అసిస్టెంట్ కలెక్టర్ నాలుగు వారాల పాటు శిక్షణ పొందనడానికి వచ్చారు. ఇక్కడున్న విభాగాలపై పట్టు సా ,దించాలంటే కనీసం ఏడాదైనా పడుతుంది. ఇక ప్రభుత్వాసుపత్రి అడ్మినిస్ట్రేటర్‌కు కేవలం పారిశుధ్యంపై అవగాహన ఉండవచ్చేమో. కీలక ఫైళ్ల విషయంలో ఈ ఇద్దరూ కిందిస్థాయి ఉద్యోగుల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది. మరి ఇన్ని రోజులుగా రెగ్యులర్ కమిషనర్‌ను నియమించకుండా డీఎంఏ అధికారులు ఏం చేస్తున్నారో అర్థం కావం లేదు. ఆదివారం వచ్చిన సీడీఎంఏ హరినారాయణ ప్రతి అంశంపైనా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానంగా 50డివిజన్లున్న ఈ నగరంలో సమస్యలు చాలానే ఉన్నాయి. కానీ అసిస్టెంట్ కలెక్టర్ సమీక్షలు, ఇతర మీటింగ్ విష యంలో ఎప్పుడు కలెక్టరేట్‌కు వెళ్తారో తెలియదు. మల్లికార్జునరెడ్డి అప్పు డప్పు డూ ప్రభుత్వాసుపత్రిని సందర్శించాల్సి ఉంటుంది. మరి క్షేత్రస్థాయిలో సమస్యలను చూసేదెవరో అంతుబట్టడం లేదు.

సీఎఫ్‌ఎంఎస్‌లో 200 ఫైళ్లు పెండింగ్

నగరపాలికలో వివిధ విభాగాలకు సంబంధించి సీఎఫ్‌ఎంఎస్‌లో 200 ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. అవి ఎప్పుడు బిల్లు వరకు వెళ్తాయో తెలియని గందరగోళం నెలకొంది. దీంతో కాంట్రాక్టర్లు బిల్లుల కోసం రోజూ కార్పొరేషన్ చుట్టూ తిరగక తప్పడం లేదు. తాజాగా రూ.6కోట్ల పనులకు సంబంధించి 20కిపైగా పనులకు టెండరు పిలిచారు. అనంతరం మరో రూ.10కోట్లకు సంబంధించిన పనులు త్వరలో టెండరు పిలవనున్నారు. ఈ క్రమంలో ఆ పనులను త్వరగా పూర్తి చేయించాల్సిన బాధ్యత ఉన్నతాధికారులదే. మరోవైపు కౌన్సిల్‌లో జరిగిన తీర్మానాలు ఓకే అయినా సంబంధిత ఫైళ్లు ముందుకు కదలాలంటే కమిషనర్ ఫైనలైజ్ చేయాలి. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో మరింత ఆలస్యం జరిగే అవకాశముంది.

చెత్త నుంచి ప్లాస్టిక్ నిషేధం వరకు... సమస్యలే

నగరంలో పారిశుధ్యం పూర్తి అధ్వానంగా మారింది. దోమలు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇంటింటి చెత్త సేకరణ మాత్రం జరగడం లేదు. మెప్మా విభాగంలో లంచావతారులు అధికమయ్యారు. బుక్ కీపర్లు ఆడింది ఆట..పాడింది పాటగా మారిందనే ఆరో పణలున్నాయి. ఇంజనీరింగ్ సెక్షన్‌లో ఫైళ్లు కదలడం లేదనే విమర్శలున్నాయి. టౌన్‌ప్లానింగ్‌లో మేడమ్‌ల హవా నడుస్తోంది. ఈ మధ్యకాలంలోనే అనుమ తుల్లేకుండా పలు సెల్లార్లు నిర్మిస్తున్నారు. వాటి నుంచే పైసలు వసూలు చేస్తున్నారు తప్ప చర్యలు తీసుకోవడం లేదు. అభివృద్ధి విషయంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఇక నగరంలో ప్లాస్టిక్ నిషేధం అటకెక్కింది. ఇవన్నీ కొన్ని మాత్రమే.. పరిష్కరించాల్సినవి చాలానే ఉన్నాయి. మరి వాటి పరిష్కారానికి ఎవరు కంకణం కట్టుకుంటారో వేచి చూడాలి.

పేదలను మోసం చేసిన వైసీపీ ప్రభుత్వం

● ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, జనవరి22(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు ఇళ్లు కట్టిస్తామంటూ, వారితో డబ్బులు తీసుకొని వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మండిపడ్డారు. నగరంలో 35వ డివిజన్ మంగళవారి కాలనీలో బుధవారం మీ ఇంటికి-ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ రాజారావు, నగర పాలక సంస్థ అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి స్థానిక ప్రజలతో సమస్యలపై ఆరాతీశారు. డ్రైనేజీ, వీధి లైట్లు, విద్యుత్ స్తంభాలు సరిగా లేకపోవడం తదితర సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. గత ప్రభుత్వంలో ఇంటి కోసం రూ.25వేలు చెల్లించినా, ఇప్పటిదాకా అతీగతీలేదని ప్రజలు వాపోయారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత ఐదేళ్లలో వైసీపీ పాలకులు అన్ని వ్యవస్థలను నాశనం చేయడంతోపాటు ప్రజలను మో సం చేశారని మండిపడ్డారు. ఎంతో ఆశతో పేదలు ఇంటి కోసం డబ్బులు చెల్లిస్తే, అసలు అవి ఏమయ్యాయో చెప్పలేని దుస్థితి నెలకొందన్నారు. ఇళ్లు లేని ప్రతి ఒక్కరికీ నూతనంగా ఇళ్లు కట్టించి ఇచ్చే బాధ్యత టీడీపీ కూటమి ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. మరో సారి దీనిపై సమగ్ర సర్వే చేయించి, వివరాలు తెలుసుకుంటానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాయల్ మురళి, పోతుల లక్ష్మీనరసింహులు, పీఎల్ఎన్ మూర్తి, కడియాల హరి, గోళ్ల సుధాకర్ నాయుడు, సైఫుద్దీన్, ఓంకార్‌రెడ్డి, ఇస్మాయిల్, చరిత, వర్కూరప్ప, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

అర్బన్ పరిధిలోని ఐదు గురికి రూ.4,02,300 సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అందజేశారు. నగరంలోని టీడీపీ అర్బన్ కార్యాలయంలో బుధవారం అల్లీపీరా, జప్పార్ బాషా, శేషమ్మ, రాయుడు, వడ్డె పవన్ కుమార్ అనే ఐదుగురికి ఎమ్మెల్యే చెక్కులను అందించారు. వారు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... అర్బన్ విషయంలో సీఎం ఉదారంగా సాయం అందిస్తున్నారన్నారు. సీఎంకు నియోజకవర్గం ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సైఫుద్దీన్, గోపాల్ గౌడ్, ముక్తియార్, రమేష్ పాల్గొన్నారు.

మేయర్‌ను కలిసిన అసిస్టెంట్ కలెక్టర్

● పలు అంశాలపై చర్చ



మేయర్ వసీంకు మొక్క అందజేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

అనంతపురం క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నగర మేయర్ మహమ్మద్ వసీంను అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న మర్యాద పూర్వకంగా కలిశారు. నగరపాలికకు వచ్చిన అసిస్టెంట్ కలెక్టర్ బిజీగా ఉన్న నేపథ్యంలో బుధవారం మేయర్‌ను ఆయన చాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఇరువురూ పలు అంశాలపై చర్చించారు. ప్రధానంగా పారిశుధ్యం, కుక్కల పట్టివేత విషయంపై దృష్టి సారిస్తానని అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న స్పష్టం చేశారు. అదేవిధంగా పలు అభివృద్ధి పనులకు సంబంధించి మేయర్, అసిస్టెంట్ కలెక్టర్ చర్చించారు.

చీకటికి తావుండకూడదు: మేయర్

నగరంలో ఎక్కడా చీకటికి తావుండకూడదని నగర మేయర్ మహమ్మద్ వసీం స్పష్టం చేశారు. నగరపాలికకు నూతనంగా కొనుగోలు చేసిన వీధి దీపాలు, పుష్‌కార్ట్‌ను నగర మేయర్ వసీం డిప్యూటీ మేయర్లు విజయ భాస్కర్‌రెడ్డి, సాహిత్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... రూ.30లక్షల వ్యయంతో 682 వీధిలైట్లు, రూ.10లక్షల వెచ్చించి 47 పుష్‌కార్ట్‌లను కొనుగోలు చేసినట్లు తెలిపారు. నగరంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు కోరిన ప్రాంతాల్లో వీధి లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పుష్‌కార్ట్ ద్వారా ఇంటింటి చెత్త సేకరణ సులభతరం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బాలాంజనేయులు, సైఫుల్లాబేగ్, అబూసాలెహ, శేఖర్‌బాబు, ఈఈ షాకీర్, డీఈ దాక్షాయణి, ఏఈ సాయి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ దామోదర్‌రెడ్డికి గిడుగు పురస్కారం



డాక్టర్ దామోదర్‌రెడ్డిని సన్మానించి మొక్కను అందజేస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కమలానగర్‌లో ఉన్న శ్రీసాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్‌రెడ్డి గిడుగు జాతీయ పురస్కారాన్ని అందు కున్నారు. గిడుగు రామ మూర్తి దంపతుల ఫౌండేషన్, శంకరం వేదిక సంయుక్త ఆధ్వర్యంలో గిడుగు వర్ధంతి సందర్భంగా ఈ పురస్కారాన్ని అందుకున్నట్లు దామోదర్ రెడ్డి తెలిపారు. సాహిత్య పరిశోధన విభాగంలో తాను రచించిన వాల్మీకి రామాయణం-చారిత్రక దృక్కోణం అనే పరిశోధన కావ్యానికి లభించిందని పేర్కొన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ గౌరిశంకర్, నవ్యాంధ్ర రచయిత సంఘం అధ్యక్షుడు బిక్కి కృష్ణ, శ్రీసాయి కళాశాల కరస్పాండెంట్ రాజేంద్రప్రసాద్ తదితరులు దామోదర్‌రెడ్డిని ప్రశంసించారు.

సాంకేతిక విప్లవాన్ని అందిపుచ్చుకోవాలి

అనంతపురం సెంట్రల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సాంకేతిక విప్లవాన్ని అందిపుచ్చుకున్న విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ట్రైనింగ్ అధికారి రంగబాబు పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఏర్పాటుచేసిన స్కిల్ అవర్ కార్యక్రమానికి రంగబాబు హాజరై మాట్లాడారు. అప్రెంటిషిప్, ఇంటర్న్‌షిప్ ద్వారా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని తెలిపారు. రైల్వే, నావల్, ఎయిర్‌లైన్స్, ఇస్రో వంటి అనేక రంగాల్లో ఐటీఐ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలున్నాయన్నారు. ప్రిన్సిపాల్ రామమూర్తి మాట్లాడుతూ.. పెనుకొండ, హిందూపురం, హైదరాబాద్, బెంగళూరు ఇలా అనేక ప్రాంతాల్లోని పరిశ్రమల ద్వారా విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. రంగబాబును జ్ఞాపికతో సత్కరించారు.


సుస్థిర వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి

● ఉద్యాన శాఖ డీడీ నరసింహారావు

అనంతపురం అర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సుస్థిర వ్యవసాయం, నిర్వహణపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని ఉద్యాన శాఖ డీడీ నరసింహరావు సూచించారు. బుధవారం స్థానిక ప్రాంతీయ ఉద్యాన శిక్షణా కేంద్రంలో ఫర్టిలైజర్ అసోసియేషన్ ఇండియా సౌత్ రీజన్ ఆధ్వర్యంలో సుస్థిర వ్యవసాయంలో ఎరువుల వాడకం విధానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుస్థిర వ్యవసాయ పద్ధతిలో పలు రకాల పంటల్లో దశల వారీగా టెక్నాలజీ వినియోగం, ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, ఫర్టిలైజర్ అసోసియేషన్ ఇండియా సౌత్ రీజన్ అధ్యక్షుడు వైవీఎస్ మూర్తి, హెచ్ఓలు, పలు కంపెనీల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

ఇద్దరు అధికారుల మధ్య వివాదం..!

● బదిలీకి దారితీసిన వైనం



విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయం

అనంతపురం రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఇటీవల జిల్లా విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయంలో ఇద్దరు అధికారులు గొడవపడ్డారు. ఈ వ్యవహారం సంస్థలోని ఉన్నతాధికారుల వరకు వెళ్లడం ఆ ఇద్దరి బదిలీకి దారితీసింది. విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ బాలాజీ వెంకటేష్, రెవెన్యూ, వ్యయ విభాగం ఏఓగా పనిచేస్తున్న రాజశేఖర్ మధ్య పాలన పరంగాను, మాటపట్టింపుల విషయంలో గొడవ జరిగినట్లు కార్యాలయంలో చర్చ జరుగుతోంది. ఆ ఇద్దరూ నువ్వెంతంటే.. నువ్వెంత అనే వరకు వెళ్లినట్లు తెలుస్తోంది. జిల్లా ఉన్నాతాధికారులు సర్దిచెప్పడంతో గొడవ సద్దుమనిగినట్లు సమాచారం. అయినప్పటికీ వారిద్దరి మధ్య కోల్డ్‌వార్ జరుగుతూనే ఉందని శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు మాట్లాడు కుంటున్నారు. ఏ కోశానా ఆ అధికారులు తగ్గకపోవడంతో సంస్థలోని ఉన్నతాధికారులు వరకు వారి పంచాయితీ వెళ్లిందంటున్నారు. దీంతో వారిని తిరుపతిలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో రిపోర్ట్ చేసుకోవాలని సీఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈక్రమంలోనే ఎస్ఏఓ రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో కార్పొరేట్ కార్యాలయంలో ఎస్ఏఓగా పనిచేస్తున్న రవికుమార్‌ను జిల్లాకు బదిలీ చేశారు.

ప్రమాణ స్వీకారానికి రండి

● మంత్రికి నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ల ఆహ్వానం



మంత్రి సవితను సన్మానిస్తున్న కార్పొరేషన్ డైరెక్టర్లు

అనంతపురం అర్బన్/శింగనమల, జనవరి 22(ఆంధ్రజ్యోతి): నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీ కార కార్యక్రమానికి హాజరుకావాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు కడియాల కొండన్న, ఆదినారాయణ ఆహ్వానించారు. వారు బుధవారం పెనుకొండలో మంత్రిని కలిసి ఆమెకు శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఆహ్వాన పత్రికను అందజేశారు. విజయ వాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈనెల 28న జరిగే ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కావాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు రామాంజనేయులు, మనోహర్, నరసింహమూర్తి, కృష్ణమూర్తి, మనోజ్‌కుమార్, సంజీవ రాయుడు, రామకృష్ణ, మహేష్, పాపన్న తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

● ఎమ్మెల్యే పరిటాల సునీత



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

రామగిరి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న పశు వైద్యశిబిరాలను పాడిరైతులు, గొర్రెల కాపరులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. మండలంలోని వెంకటాపురంలో బుధవారం పశువైద్యులు సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశు వైద్యశిబిరాన్ని ఆమె పరిశీలించారు. పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలనే కరపత్రాలను విడుదల చేశారు. పాల ఉత్పత్తి పెంచడం, గొర్రెలు, మేకలు, కోళ్ల తదితర వాటికి రోగ నివారణ మందులు అందిస్తున్నట్టు తెలిపా రు. ప్రభుత్వం ఎంతో మంచి ఉద్దేశంతో ఉచిత పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేసిందన్నారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వడ్డెర్ల సమస్యల పరిష్కారానికి కృషి

● సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవళ్ల మురళి



దేవళ్ల మురళిని సన్మానిస్తున్న వడ్డెర్ల సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వడ్డెర్ల సమస్యలను ఎప్పటికప్పుడురాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారం కోసం కృషి చేస్తామని వడ్డెర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవళ్ల మురళి పేర్కొన్నారు. నగరంలోని వడ్డెర్ల సంఘం కార్యాలయంలో బుధవారం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపికైన దేవళ్ల మురళికి ఉమ్మడి అనంత జిల్లా వడ్డెర్ల సంఘం అధ్యక్షుడు కుంచెపు వెంకటేష్, నాయకులు మంజునాథ్, దళవాయి కుమార్, గంగరాజు శాలువ కప్పి, పూల మాల వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దేవళ్ల మురళి మాట్లాడుతూ.. వడ్డెర్లకు 50 సంవత్సరాలకే పింఛన్ సదుపాయం కల్పించాలన్నారు. కొండ క్వారీలల్లో 35 శాతం కేటాయించాలన్నారు. ప్రమాద వశాత్తు మరణించిన వారికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. తనను రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపిక చేసిన సంఘం నాయకులు, వడ్డెర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సంఘం నాయకులు సమన్వయంతో ముందుకెళితేనే వడ్డెర్లకు తగిన న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సురేష్, బాల అంకన్న, రామాంజినేయులు, లక్ష్మి, లక్ష్మన్న పాల్గొన్నారు.

పరిటాల రవీంద్ర వర్ధంతికి తరలిరండి: టీడీపీ



మాట్లాడుతున్న రామగిరి నాయకులు

రామగిరి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురంలో శుక్రవారం నిర్వహించే మాజీ మంత్రి పరిటాల రవీంద్ర 20వ వర్ధంతికి తరలిరావాలని టీడీపీ స్థానిక నాయకులు పిలుపునిచ్చారు. వారు బుధవారం టీడీపీ స్థానిక కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పరిటాల రవీంద్ర వర్ధంతికి మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పరిటాల అభిమా నులు పెద్దఎత్తున తరలివచ్చి నివాళులర్పించాలన్నారు. అలాగే సేవా కార్యక్రమాలలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశం లో టీడీపీ మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతీ ప్రసాద్, తెలుగుయువత అధ్యక్షుడు శ్రీధర్ నాయుడు, నియోజకవర్గ ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి పోతన్న, ఎంపీటీసీ శ్రీనివాసులు, పేపర్ శీనా, అక్కులప్ప, బ్రహ్మా, జమచంద్ర నాయుడు, గంగిరెడ్డి పాల్గొన్నారు.

● రాప్తాడు: రామగిరి మండలంలోని వెంకటాపురంలో శుక్రవారం నిర్వహించే పరిటాల రవీంద్ర 20వ వర్ధంతి కార్యక్రమానికి మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. ప్రతి గ్రామం నుంచి తరలిరావాలని వారు బుధవారం ప్రకటనలో కోరారు.

చీనీ టన్ను రూ. 20వేలు

అనంతపురం రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.20 వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 5వేలు, సరాసరి రూ. 14,100తో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 21 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

రేపు జాబ్‌మేళా

గుంతకల్లుటౌన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, జేకేసీ కోఆర్డినేటర్ నాగరాజు బుధవారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్కేపీ డిగ్రీ కళాశాల, జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్‌మేళాకు వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్ పూర్తి చేసి, 18 ఏళ్ల నుంచి 44 ఏళ్లలోపు వయసుగలవారు అర్హులన్నారు. బయోడేటాతో పాటు ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు తీసుకుని ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. నిరుద్యోగ యువత జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

రథోత్సవానికి రూ.3.50 లక్షల వితరణ



చెక్కును అందజేస్తున్న దేవినేని అవినాష్ తదితరులు

కళ్యాణదుర్గం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పట్టాభిరామస్వామి ఆలయ రథోత్సవానికి ఆ ఆలయ అధ్యక్షుడు దేవినేని అవినాష్‌తోపాటు దేవినేని ధర్మతేజ, దేవినేని నవీన్, అమిలినేని యశ్వంత్ రూ.3.50 లక్షలు వితరణ చేశారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద బుధవారం ఇందుకు సంబంధించిన చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు వారు అందజేశారు. ఆలయ రథం మరమ్మతులకుగాను ఈ వితరణ చేసినట్లు చెప్పారు.

లోకేశ్ జన్మదిన వేడుకలకు తరలిరండి

రాయదుర్గం రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు పట్టణంలో గురువారం జరగనున్నాయని, పెద్దఎత్తున తరలిరావాలని మండల కన్వీనర్ హనుమంతు బుధవారం ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం 9.30 గంటలకు స్థానిక పార్టీ కార్యాలయం నుంచి ఎన్‌టీఆర్ సర్కిల్ వరకు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ జరగనున్నట్లు చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

పంచాయతీ ఆదాయాన్ని పెంచాలి

పామిడి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పంచాయతీల ఆదాయాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీపీఓ ప్రభాకర్ సూచించారు. మండలంలోని వంకరాజుకాలువలో గల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా నడుచుకోవాలన్నారు. అలాగే పంచాయతీ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తేజోత్స్న, ఈఓఆర్‌డీ కృష్ణకుమార్, పంచాయతీ కార్యదర్శి దేవేంద్ర, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

శెట్టూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రఘురామారావు బుధవారం ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తప్పక రావాలని కోరారు.

అక్రమ కట్టడాలు నిలిపేయాలి

గుత్తి,జనవరి22(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో అక్రమంగా చేపడుతున్న కట్టడాలను, గృహనిర్మాణాల అనుమతితో చేపడుతున్న వాణిజ్యసముదాయ నిర్మాణాలను వెంటనే నిలిపి వేయాలని పట్టణ ప్రణాళిక అధికారులు ఆయా యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు టౌన్ ప్లానింగ్ అధికారి మారుతీప్రసాద్ తెలిపారు. అక్రమ నిర్మాణాలపై ఈనెల 14న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన పట్టణ ప్రణాళిక అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేపట్టారన్నారు. ఇది వరకే సదరు ఇంటి యజమానులకు నోటీసులు జారీ చేశామన్నారు. బుధవారం కూడా కట్టడాలను పరిశీలించి నిర్మాణాలను నిలిపివేశామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న, నిర్మించిన కట్టడాలను తొలగించాలని ఆదేశించామన్నారు. తొలగించని పక్షంలో మున్సిపల్ చట్టం మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు అప్పస్వామి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నతి నిధుల స్వాహాపై చర్యలు తీసుకోండి

● ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌కు డ్వాక్రా మహిళల వినతి



ఎమ్మెల్యేకు సమస్యను విన్నవిస్తున్న డ్వాక్రా మహిళలు

యాడికి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలకు సంబంధించిన ఉన్నతి నిధులు, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద మంజూరైన నిధులను స్వాహా చేసిన వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయంచేయాలని పలువురు డ్వాక్రాసంఘాల మహిళలు ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డిని కోరారు. మండలంలోని నగరూరు, తూట్రాళ్లపల్లి గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రా మాల్లో ప్రజలతో సమావేశాలు నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నగరూరులో ఎస్సీకాలనీలో ఏళ్లతరబడి నెలకొని ఉన్న రస్తా సమస్యను పరిష్కరించాలని పలువురు కాలనీవాసులు విన్నవించా రు. సమస్య ఉన్న రస్తా వద్దకు ఎమ్మెల్యే స్వయంగా వెళ్లి పరిశీలించి దీని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి సూచించారు. నగరూరు, తూట్రాళ్లపల్లి గ్రామాల్లో డ్వాక్రా మహిళలకు చెందిన ఉన్నతి నిధులు, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను స్వాహాచేసిన వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని సంఘం సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. దీంతో ఆయన సమస్యపై వెలుగు ఏసీ వీరస్వామి, ఏపీఎం చంద్రశేఖర్‌తో ఆరాతీశారు. నగరూరులో రూ.75వేలు, తూట్రాళ్లపల్లిలో రూ.4,49,200 రికవరీ కావాల్సి ఉందని అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. నిధుల స్వాహాకు పాల్పడిన సీసీపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయాలని అధికారులకు, డ్వాక్రా మహిళలకు తెలిపా రు. మహిళలకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని సీఐ ఈరన్నకు సూచించారు. తర్వాత తూట్రాళ్లపల్లిలో రస్తా సమస్యను పరిశీలించి చట్టప్రకారం పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు, నాయకులు నాగమునిరెడ్డి, పరిమి చరణ్, రవికుమార్‌రెడ్డి, శ్యాంసుందర్‌నాయుడు, వేణు, నరసింహులు, లక్ష్మణ్, వెంకటనారాయణరెడ్డి, ఆదినారాయణ, విశ్వనాథ్, నీలకంఠ పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బందితో ఆర్డీఓ సమావేశం

ఉరవకొండ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్ స్థానిక రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. భూ రీ సర్వే, రెవెన్యూ సదస్సులలో రైతుల నుంచి వచ్చిన అర్జీలపై సమీక్ష జరిపినట్లు తెలిపారు. ప్రజలు తమ భూసమస్యలు పరిష్కరించుకోవడానికి రెవెన్యూ సదస్సులు, రీసర్వే మంచి అవకాశమని అన్నారు. రీసర్వేను పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా చేపట్టాలని సిబ్బందికి సూచించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్ బాషా, మండల సర్వేయర్ రత్నాకర్, రీసర్వే డీటీ పవన్, ఆర్ఐ రామకృష్ణ వీఆర్వోలు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా విజయభాస్కర్ బాధ్యతలు

బొమ్మనహాళ్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓగా విజయభాస్కర్ బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఎంపీడీఓగా ఉన్న షకీలాబేగం విడపనకల్లు మండలానికి బదిలీ అయ్యారు. దీంతో కొద్దిరోజులు ఆమె స్థానంలో డీ.హీరేహాళ్ ఎంపీడీఓ దాసానాయక్ ఇన్‌చార్జిగా పని చేశారు. ఇప్పుడు ముదిగుబ్బ ఎంపీడీఓగా ఉన్న విజయభాస్కర్ బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

అల్ట్రా మారథాన్ రన్ ప్రారంభం



జెండా ఊపి మారథాన్ రన్ ప్రారంభిస్తున్న మాంచో ఫెర్రర్

బెళుగుప్ప, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాద్రిపల్లిలో బుధవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో పదవ అల్ట్రా మారథాన్ రన్‌ను ప్రారంభించారు. ఇందులో పాల్గొనేందుకు వచ్చిన స్పెయిన్ దేశస్థులకు స్థానికులు ఘన స్వాగతం ప్రజలు పలికారు. ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్ మాట్లాడుతూ.. నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ఆర్డీటీ ప్రధాన లక్ష్యమన్నారు. 600 గ్రామాల్లో 170 కిలోమీటర్ల మేర ఈ రన్ జరుగుతుందన్నారు. వెంకటాద్రిపల్లిలో ప్రారంభమైన ఈ కార్యక్రమం బత్తలపల్లిలోని ఫాదర్ ఫెర్రర్ ఘాట్‌లో ముగుస్తుందని అన్నారు. అనంతరం ఆయన సంస్థ మహిళా విభాగం డైరెక్టర్ విశాలా ఫెర్రర్‌తో కలిసి జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. సీఐ చిన్న గౌస్, సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక సబ్‌జైలు తనిఖీ

గుత్తి, జనవరి 22(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ప్రత్యేక సబ్‌జైలును జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ శివప్రసాద్‌యాదవ్, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, ఆరవ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీహరి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలతో ముఖాముఖి నిర్వహించారు. సబ్ జైలులో బాలనేరస్థులు ఉంటే వెంటనే మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్‌కు వివరాలు తెలియజేయాలన్నారు. వారిని జువెనల్ హోంకు తరలించాలని సూచించారు. అనంతరం జైలులో బ్యారెక్, మరుగుదొడ్లు, వంట గది, స్టోర్‌రూం, రికార్డులను పరిశీలించారు. జైలర్ మహేశ్వరుడు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

బొమ్మనహాళ్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ పద్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు తమ పరిధిలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను సభ్యులకు వివరించారు. వ్యవసాయశాఖ ద్వారా జరిగిన ప్రగతిని ఏఓ సాయికుమార్ వివరించారు. ఇక మిగిలిన శాఖలకు సంబంధించిన ప్రగతిని ఆయా అధికారులు వివరించగా వాటిపై ఎటువంటి చర్చ లేకపోవడంతో సభ సాదాసీదాగా ముగిసింది. ఇదిలా ఉండగా కొందరు ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి ముందే సంతకాలు పెట్టి వెళ్లిపోయారు. కురువల్లి ఎంపీటీసీ బసవరాజు స్థానంలో అతడి సోదరుడు వెంకటేశ్, బొల్లనగుడ్డ ఎంపీటీసీ రాజేశ్వరి స్థానంలో ఆమె కుమారుడు వంశి, దర్గాహోన్నూరు ఎంపీటీసీ శ్రీదేవి స్థానంలో ఆమె భర్త రామకృష్ణ హాజరయ్యారు. మండల స్థాయి అధికారులు కొందరు గైర్హాజరయ్యారు. తహసీల్దార్ మునివేలు, ఇన్‌చార్జి ఎంపీడీఓ దాసానాయక్, ఈఓపీఆర్డీ దాస్, ఎంఈఓలు ఈరన్న, మల్లికార్జున, పశువైద్యాధికారి వెంకటరెడ్డి, పంచాయతీ జేఈఈ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లను నిర్మించి ఇవ్వాలి

● సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగదీశ్ డిమాండ్



ధర్నాలో ప్రసంగిస్తున్న జగదీశ్

గుంతకల్లు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అద్దె ఇళ్లల్లో నివసిస్తున్న వారందరికీ ప్రభుత్వం సొంత ఇళ్లను నిర్మించి ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డీ జగదీశ్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఇళ్లు, స్థలాలు లేనివారితో కలిసి బుధవారం ఉదయం సీపీఐ నాయకులు ర్యాలీ, ధర్నా నిర్వహించారు. స్థానిక మెయిన్ రోడ్డు గుండా ర్యాలీగా వచ్చి మునిసిపల్ కార్యాలయం ఎదుట రహదారిపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జగదీశ్ మాట్లాడుతూ.. గతంలో రూ. 2.50 లక్షలుగా ఉన్న హౌసింగ్ రుణాన్ని జగన్ ప్రభుత్వం రూ. 1.80 లక్షలకు కుదించిందని, రెండు సెంట్ల స్థలానికి బదులు ఒక సెంటును కేటాయించిందని అన్నారు. దీంతో లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకోలేకపోయారన్నారు. చంద్రబాబు అయినా హౌసింగ్ రుణాన్ని రూ. 4 ల క్షలకు పెంచి, రెండు సెంట్ల స్థలాన్ని కేటాయించాలని కోరారు. నాయకులు వీరభద్రస్వామి, గోపీనాథ్, మహేశ్, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

కేవీకేలో గ్రామీణ యువతకు శిక్షణ

కళ్యాణదుర్గంరూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యవసాయ కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఉద్యానపంటలో నాణ్యమైన అంటుమొక్కల ఉత్పత్తి, మార్కెటింగ్‌పై గ్రామీణ యువతకు శిక్షణ తరగతులను నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ పాల్గొని మాట్లాడారు. ఉద్యానపంటలలో నాణ్యమైన నారు, అంటు మొక్కల ఉత్పత్తికి చేపట్టే పద్ధతులు, నర్సరీ ఏర్పాటుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఆత్మా పీడీ మద్దిలేటి మాట్లాడుతూ.. నర్సరీల ఏర్పాటులో బ్యాంకు రుణాల గురించి తెలిపారు. డ్వామా ఏపీడీ రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

25 గొర్రెలు మృతి

పెద్దవడుగూరు, జనవరి22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండూరు గ్రామంలోని రామకృష్ణ, గోపాల్, నాగభూషణ, సన్నప్ప అనే గొర్రెల కాపరులకు చెందిన 25 గొర్రెలు బుధవారం జొన్నపంట తిని విషప్రభావంతో మృతి చెందాయి. మరో 20గొర్రెలు ప్రాణాపాయస్థితిలో ఉన్నాయి. రూ.5లక్షల మేర నష్టపోయినట్లు గొర్రెల కాపరులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ముద్దలాపురం రహదారి పరిశీలన

బ్రహ్మసముద్రం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దలాపురం నుంచి రాయలప్పదొడ్డి గ్రామానికి వెళ్లే రహదారిని ఆర్డీవో వసంతబాబు బుధవారం పరిశీలించారు. వివాదంలో ఉన్న ఈ రహదారిని ఇటీవల తహసీల్దార్ సుమతి రైతులు, గ్రామస్థులతో సమావేశమై సమస్యను పరిష్కరించారు. దీంతో ఆర్డీఓ రహదారిని పరిశీలించి ఉపాధి పథకంలో మట్టి పనులు చేయించాలని, అలాగే శాశ్వత రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని పంచాయతీ రాజ్ అధికారులను ఆదేశించారు. ఆర్ఐ నాగిరెడ్డి, మండల సర్వేయర్ సుకన్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రమశక్తి సంఘాలను ఏర్పాటు చేయాలి

రాయదుర్గం రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రతి పంచాయతీలోనూ 50 మంది ఉపాధిహామీ కూలీలతో శ్రమశక్తి సంఘాలను ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ కొండన్న ఉపాధి సిబ్బందికి సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఆయన ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి ఫీల్డు అసిస్టెంట్ తమ పంచాయతీలో 50 మంది కూలీలతో శ్రమశక్తి సంఘాన్ని ఏర్పాటు చేసిమేట్‌ను ఎన్నుకోవాలన్నారు. ఈనెల 31లోగా శ్రమశక్తి సంఘాల ఏర్పాటును పూర్తి చేయాలన్నారు. గోకులం నిర్మాణాలు త్వరగా పూర్తవ్వాలని సూచించారు. వంద పని రోజులు దగ్గరగా ఉన్న కూలీలను గుర్తించి తిరిగి వారికి పనులు కల్పించాలని చెప్పారు. సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో వైభవంగా జాతరలు

● గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

● పెద్దఎత్తున పాల్గొన్న ప్రజలు, ప్రముఖులు

కళ్యాణదుర్గం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళాపురం, సీబాయి గ్రామాల్లో బుధవారం మారెమ్మ, కొల్లాపురమ్మ జాతరలు (దేవరలు) వైభవంగా జరిగాయి. సందర్భంగా గ్రామస్థులు స్థానిక ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. బోనాలు, జంతుబలులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ జాతరలు చేయడం వల్ల గ్రామాల్లో పంటలు బాగా పండి ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తారని తమ ప్రగాఢ నమ్మకమని గ్రామపెద్దలు తెలిపారు. అందుకే గ్రామస్థులందరి కోరిక మేరకు అందరం కలిసికట్టుగా జాతరలను ఘనంగా జరుపుతున్నామని చెప్పారు. ప్రతిఇంటా షామియానాలు వెలిశాయి. బంధువులను, మిత్రులను ఆహ్వానించి విందు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల టీడీపీ నాయకుల ఆహ్వా నం మేరకు ప్రముఖులు సైతం హాజరయ్యారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, నాయకులు దేవినేని అవినాష్, అమిలినేని యశ్వంత్ తదితరులు పాల్గొని అమ్మవార్లను దర్శించి పూజలు చేయించారు.

శెట్టూరు: మండలంలోని ఖైరేవులో మారెమ్మ జాతర ఘనంగా జరిగింది. గ్రామస్థులు స్థానిక ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్థుల ఆహ్వానం మేరకు జాతరకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు హాజరయ్యారు. గ్రామ టీడీపీ నాయకులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని ఎమ్మెల్యే దర్శించుకుని పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఇక ములకలేడు గ్రామంలో నిర్వహించిన కొల్లాపురమ్మ జాతర ఘనంగా ముగిసింది. సుమారు 85 ఏళ్ల క్రితం జాతర జరిపించారు. మళ్లీ ఇన్నేళ్లకు ఇప్పుడు చేయడంతో గ్రామస్థులందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. మంగళవారం రాత్రి అమ్మవారికి గండ దీపోత్సవంతో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్థులు భారీఎత్తున పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



శెట్టూరు మండలం ములకలేడులో ప్రత్యేకాలంకరణలో కొల్లాపురమ్మ అమ్మవారు

బొమ్మనహాళ్: మండల కేంద్రంలో దాదాపు వందేళ్ల తర్వాత నిర్వహించిన ఊరి దేవర అంగరంగ వైభవంగా సాగింది. రెండురోజుల పాటు జరిగిన దేవర బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా గ్రామదేవతలైన దేవమ్మ, సుంకలమ్మ ఆలయంలో గ్రామస్థులు విశేష పూజలు చేశారు. మంగళవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకూ ఆలయానికి భక్తులు పోటెత్తారు. సాయంత్రం సమయంలో కుంబల మహోత్సవం నిర్వహించారు. బుధవారం ఉదయం ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, అనంతపురం, కళ్యాణదుర్గం ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, దగ్గుబాటి వెంకటప్రసాద్ హాజరయ్యారు. అలాగే భారీ సంఖ్యలో జనం తరలిరావడంతో బొమ్మనహాళ్ కిక్కిరిసింది.

కణేకల్లు: మండలంలోని నాగేపల్లిలో కొల్లాపురమ్మ దేవర ఘనంగా జరిగింది. జనం పెద్దఎత్తున పాల్గొన్నారు. స్థానిక టీడీపీ నాయకుల ఆహ్వానం మేరకు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు దేవరకు హాజరై అమ్మవారికి పూజలు చేశారు.

గుంతకల్లుటౌన్: మండలంలోని కొంగనపల్లిలో పెద్దమ్మ తల్లి ఊరి దేవరను ఘనంగా నిర్వహించారు. బంధుమిత్రుల రాకతో గ్రామం కిటకిటలాడింది. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆయన సోదరులు గుమ్మనూరు నారాయణస్వామి, గుమ్మనూరు శ్రీనివాసులు హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. తర్వాత టీడీపీ నాయకులు ఇచ్చిన విందులో పాల్గొన్నారు. అలాగే టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆర్ జితేంద్రగౌడ్, బీసీ సెల్ రాష్ట్ర అధికారప్రతినిధి పవన్‌కుమార్‌గౌడ్, యువనేత అనిల్‌గౌడ్ హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.



బొమ్మనహాళ్‌లో జాతరకు వస్తున్న ప్రభుత్వ విప్ కాలవ



కళ్యాణదుర్గం మండలం సీబాయిలో దేవరకు వస్తున్న ఎమ్మెల్యే అమిలినేని, ఎంపీ పార్థసారథి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్



గుంతకల్లు మండలం కొంగనపల్లిలో పెద్దమ్మ తల్లిని దర్శిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తదితరులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

కళ్యాణదుర్గంరూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కామక్కపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ములకనూరు గ్రామానికి చెందిన మారెక్క బుధవారం పని నిమిత్తం కళ్యాణదుర్గం వచ్చారు. పని అనంతరం స్వగ్రామానికి ఆటోలో బయలు దేరారు. కాగా ఆటోలో వెనుకవైపున కూర్చున్న ఆమెను కామక్కపల్లి వద్ద ముద్దినాయనపల్లికి చెందిన అనిల్ బైక్‌లో వేగంగా వస్తూ ప్రమాదవశాత్తూ ఢీకొట్టాడు. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే వారిని చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా వుండటంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను కారు ఢీకొనడంతో ఇద్దరు యువకులకు..

బొమ్మనహాళ్: మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని ఉంతకల్లు గ్రామానికి చెందిన యువకులు యోగేంద్ర, చరణ్ ఊరి దేవర నిమిత్తం బొమ్మనహాళ్‌కు వచ్చారు. దేవరను చూసుకొని స్వగ్రామానికి స్కూటీలో బయలుదేరారు. కస్తూర్బాగాంధీ పాఠశాల వద్దకు రాగానే వేగంగా వచ్చిన (ఏపీ40 ఈజీ 7607) నంబరు గల కారు ఢీ కొంది. ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరికీ కాళ్లు విరిగిపోయినట్లు స్థానికులు తెలిపారు. వెంటనే వారిని అంబులెన్స్‌లో బళ్లారి విమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ నబీరసూల్ తెలిపారు.

కంబాలపల్లి వద్ద ఓ వ్యక్తికి..

శెట్టూరు: మండలంలోని కంబాలపల్లి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకిరికి తీవ్రగాయాలయ్యాయి. ఎదురెదురుగా కారు, ద్విచక్రవాహనం వేగంగా వచ్చి పరస్పరం ఢీకొన్నాయి. దీంతో ద్విచక్రవాహనదారుడైన కుందుర్పి మండలం రుద్రంపల్లి గ్రామానికి యల్లప్పకు తీవ్ర గాయాలయ్యాయి. కారులో వెళ్తున్న వారికి ఏమీ కాలేదు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోబోల్తా.. విద్యార్థులకు స్వల్ప గాయాలు

పెద్దవడుగూరు: మండలంలోని చిత్రచేడు సమీపంలో బుధవారం విద్యార్థులతో వెళుతున్న ఆటో బోల్తాపడడంతో ముగ్గురు విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. చిత్రచేడు, మొలకతాళ్ల గ్రామాలకు చెందిన పలువురు విద్యార్థులు గార్లదిన్నె మండలం తరిమెల గ్రామంలో ఉన్న ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లి తిరిగి ఆటోలో వస్తుండగా.. చిత్రచేడు వద్ద టైరు పంక్చర్ కావడంతో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో ముగ్గురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. మిగతావారికి ఏమీ కాలేదు.

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండండి

రాయదుర్గంరూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. మున్సిపల్ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామని అజ్ఞాత వ్యక్తులు పలువురు వ్యాపారులకు, ప్రజలకు ఫోన్ చేసి మీ ట్రేడ్ లైసెన్స్ పూర్తి అయిందని, రెన్యూవల్ చేయాలని, ఫోన్‌పే ద్వారా డబ్బులు వేయాలంటూ కాల్స్ చేస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. ఎవరూ కూడా వారి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఇది సైబర్ నేరగాళ్ల పనేనని తెలిపారు. మున్సిపల్ కార్యాలయం పేరు చెప్పి ఫోన్ పే వేయమని కాల్స్ వస్తే వెంటనే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. పట్టణంలోని ప్రజలు, వ్యాపారులు పన్నులను నగదు రూపంలో చెల్లించాలన్నారు. లేకపోతే మున్సిపల్ అధికారులు వచ్చినప్పుడు చెల్లించాలని అన్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా జాగ్రత్త పడాలని చెప్పారు.

కేబుల్ చోరీకి యత్నం

గుత్తిరూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఎంగిలిబండ గ్రామశివారులోని సోలార్ ప్లాంటులో బుధవారం తెల్లవారుజామున కేబుల్‌ను ఇద్దరు వ్యక్తులు చోరీ చేసేందుకు యత్నిస్తూ పట్టుబడ్డారు. గోపాల్ రెడ్డికి చెందిన సోలార్ ప్లాంటులో సోలార్‌కు ఉన్న కేబుల్‌ను కత్తిరించి ఎత్తుకువెళ్తుండగా.. వాచ్‌మెన్లు గమనించి వారిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వారిద్దరూ జక్కలచెరువు, పెద్దవడుగూరుకు చెందిన వారిగా గుర్తించారు. పోలీసులు విచారణ చేపట్టారు.

రైల్వే ఉద్యోగి బైక్ చోరీ

యాడికి, జనవరి22(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువులో రైల్వే ఉద్యోగి బంది కుమార్ బైక్‌ను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. తాను రైల్వే గేట్‌మెన్‌గా పనిచేస్తున్నానని, మంగళవారం రాత్రి విధులకు వచ్చి గేట్ వద్ద ఉన్న తమ గది పక్కలో బైక్ పార్క్ చేశానని, బుధవారం ఉదయం పరిశీలించగా బైక్ కనిపించలేదని వాపోయాడు. గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారని తెలిపాడు. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పాడు.

అక్రమ మద్యం విక్రేత అరెస్టు

యాడికి, జనవరి22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపాడు క్రాస్ వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒకరిని బుధవారం అరెస్టు చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. వేములపాడు క్రాస్ వద్ద అక్రమంగా మద్యం అమ్ముతున్నారనే సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడిచేశామన్నారు. మద్యం విక్రేత కొలిమి ఇస్మాయిల్‌ను అరెస్టు చేసి అతడి వద్ద నుంచి 32మద్యం బాటిళ్లు, 4బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దాడిలో ఎస్ఐ వెంకటరమణ, ఏఎస్ఐ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

లాస్ట్‌లో వచ్చి.. ఫస్ట్ ప్రైజ్ గెలిచాయి..!

● రాతిదూలం లాగుడు పోటీలో నంద్యాల జిల్లా వృషభాల విజయం

● ముగిసిన అంకాలమ్మ, కుంటెమ్మ జాతర



రాతిదూలాన్ని లాగుతున్న వృషభాలు

పామిడి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెన్నానది ఒడ్డున వెలసిన అంకాలమ్మ, కుంటెమ్మ 17వ జాతర బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా చివరి రోజున నిర్వహించిన న్యూ కేటగిరి విభాగం రాతిదూలం లాగుడు పోటీలో 15గాండ్ల ఎద్దులు తలపడ్డాయి. ఆఖరి జతగా బరిలో దిగిన వృషభాలు మొదటి స్థానంను కైవసం చేసుకున్నాయి. రాతిదూలం లాగుడును వీక్షించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. ఈ పోటీల్లో నంద్యాల జిల్లా పెద్దకొట్టాల గ్రామానికి చెందిన బోరెడ్డి కేశవరెడ్డి వృషభాలు 4,520 అడుగుల మేర రాతి దూలాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచి రూ. 50వేలు సొంతం చేసుకున్నాయి. మొదటి బహుమతిని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్ విరాళం ఇవ్వడంతో టీడీపీ యువ నాయకుడు అశోక్ అందజేశారు. ఇక నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం డీ రంగాపురం గ్రామం జూటూరు రామకృష్ణారెడ్డి, బేతంచెర్ల మండలం గోర్లగుంట గ్రామం మిడుతూరు ఇంద్రసేనారెడ్డి వృషభాలు ద్వితీయస్థానంలో, కడప జిల్లా పెండ్లమర్రి మండలం బాలయ్యగారిపల్లి గ్రామం నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి వృషభాలు తృతీయ స్థానంలో నిలిచాయి. అలాగే అనంతపురం జిల్లా అక్కపంల్లి గ్రామం కోనేపల్లి ఇంద్రారెడ్డికి చెందిన వృషభాలు నాలుగో స్థానంలో, కడప జిల్లా చెన్నూరు మండలం బలిసింగాయపల్లికి చెందిన మేడా వంశీరెడ్డి, అదే జిల్లా రూకువారిపల్లి చంద్రా శ్రీకాంత్‌రెడ్డి వృషభాలు ఐదో స్థానంలో, ఆ జిల్లాలోనే ఖాదర్‌ఖాన్ కొట్టాలకు చెందిన భావనశ్రీ వృషభాలు ఆరోస్థానంలో నిలిచి బహుమతులు సాధించాయి.